తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

గురువారం
3 సెప్టెంబర్ 2026

పేజీలు - 12

# సిండికేట్ 'మత్తు'లో ఆబ్కారీ శాఖ?

- నిర్మల్ జిల్లాలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల నిర్వహణ



*నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 02, (జనంసాక్షి): నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో మద్యం సిండికేట్ల హవా కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండానే బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగేందుకు మంచి నీరు దొరకకపోయినా.. మద్యం మాత్రం సులభంగా లభిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి పేరుతో వివిధ కమిటీలు ఏర్పాటు చేసి వేలం పాటల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు సమీకరించి బెల్ట్‌షాపుల నిర్వహణకు మార్గం సుగమం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.*

బెల్ట్‌షాపులతో పాటు కొన్ని వైన్‌షాపుల్లోనూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. అధిక ధరలపై ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి ఎమ్మార్పీ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### సరిహద్దుల్లో 'దేశీ' దందా?

జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పక్క రాష్ట్రం నుంచి దేశీ మద్యం అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. మారుమూల గ్రామాలకు సైతం రహస్య మార్గాల్లో మద్యం చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. తనిఖీల సమయంలో దుకాణాలను మూసివేసి, అధికారులు వెళ్లిన అనంతరం తిరిగి విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### తనిఖీలు.. తూతూమంత్రమేనా?

అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రివేళల్లో షట్టర్లు మూసివేసి దొడ్డిదారిన మద్యం విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అక్రమ విక్రయాలపై నిరంతర నిఘా, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### కుటుంబాలపై పెనుభారం

అధిక ధరలకు మద్యం విక్రయించడం వల్ల కూలీలు, పేద, మధ్యతరగతి మిగతా 19లో..

# సైబర్ మోసాలకు నో చెప్పండి

- అప్రమత్తతతో ముందుకు సాగండి
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగృత దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ పట్టణంలోని బి.ఎడ్ కళాశాల విద్యార్థులతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు,సోషల్ మీడియా నేరాలు,సైబర్ బులీయింగ్,ఆన్‌లైన్ వేధింపులు, మ్యాట్రిమోనీ మోసాలు,సైబర్ స్టాకింగ్ వంటి అంశాలపై వీడియో ప్రదర్శన ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని,తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని సూచించారు. బ్యాంకింగ్,సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను బలమైనవి, క్లిష్టమైనవిగా రూపొందించుకోవాలని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ మిగతా 19లో..

# అనుమానం పెనుభూతం!

- భార్యను హత్య చేసిన సైకో భర్త





**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2, (జనంసాక్షి) :** అనుమానం పెనుభూతం అయిందా? ఇప్పటికే మూడు సార్లు చంపడానికి ప్రయత్నించి నాలుగో సారి సఫలం అయ్యాడా? నెన్నెల మండల కేంద్రానికి చెందిన తోట మల్లేష్ సబిత దంపతుల దాంపత్యంలో అనుమానం అనే బీజం చిచ్చు రేపిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కారణం గతంలో ఒకసారి మల్లేష్ సబితను కరెంటు షాక్ తో చంపడానికి ప్రయత్నించాడు. మరో రెండు సార్లు గొంతు పిసికి చంపాలని చూశాడు. కాని అప్పుడు అవేవి కుదరలేదు. కాని తాజాగా బుధవారం మధ్యాహ్నం ఇంటి చుట్టుపక్కల వాళ్ళు వ్యవసాయ పనులకు, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ఇదే అదనుగా చూసిన మల్లేష్ మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో భార్యతో గొడవ ఆమెను అత్యంత పాశవికంగా హత్య చేసి, అనంతరం మొబైల్ ఫోన్, రక్తపు మరకలు అంటిన దుస్తులు మార్చుకొని, ఇంటి తలుపులు మూసి దర్జాగా ఉడాయించాడు. సాయంత్రం నాలుగున్నర తర్వాత కొడుకు తిరుమల్ స్కూల్ నుంచి ఇంటికొచ్చి చూసే సరికి తల్లి మంచంపై పడుకొని ఉంది. ఎప్పుడు వచ్చినా పలకరించే తల్లి ఎలాంటి శబ్దం చేయక పోవడంతో దగ్గరికి వెళ్లి చూడటంతో తల్లి రక్తపు మడుగులో పడి చనిపోయి ఉంది. వెంటనే షాక్ కు గురైన తిరుమల్ ఇంటి పక్కల వారిని పిలిచి చూపించగా విగత జీవిగా పడి ఉన్న సబిత కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అన్ని కోణాల్లో విచారించారు. సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మల్లేష్ ఆచూకీ కోసం సీసీ కెమెరాలను జల్లెడ పట్టే పనిలో నిమగ్నం అయ్యారు. కాగా నిందితుని సోదరికి సబిత మధ్యాహ్నం 1:39 కి ఫోన్ చేసి మీ తమ్ముడు పిసపిస చేస్తుండు ఆసుపత్రికి తీసుకెళ్దాం అని ఫోన్ చేయగా మేము చేనులోమిగతా 19లో..

# విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- మంత్రి సీతక్క



**మంగపేట, సెప్టెంబర్02 (జనంసాక్షి) :** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన 14 ల్యాప్‌టాప్‌ల కంప్యూటర్ ల్యాబ్‌ను సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... విద్యార్థినులు చదువుతో పాటు కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలని, భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యాలయంలో భోజన నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర వసతులను ఆమె పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉపాధ్యాయుల అనుమతి లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లవద్దని హెచ్చరించారు. చదువుతో పాటు శారీరక ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని, ప్రాంగణంలో పండ్ల మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం రాజుపేట గ్రామంలోని రైతు వేదిక వద్ద స్థానిక తహసిల్దార్ తోట రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి సీతక్క తన చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జీసీడీఓ బుర్ర రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, తాహసిల్దార్ తోట రవీందర్, మండల విద్యాశాఖ అధికారి పొదెం మేనక, కేజీబీవీ ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మాజీ మండలశాఖ అధ్యక్షులు మైల జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ సేవలు చిర స్మరణీయం

### మండల అధ్యక్షులు కట్కంఅశోక్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**మహాదేవపూర్: సెప్టెంబర్ 2 (జనంసాక్షి).** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్కం అశోక్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్వర్గీయమాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి.17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ చేసిన సేవలు రాష్ట్ర ప్రజలంతా మరువలేనివని ఆయన పేద ప్రజలకు రైతులకు. మహిళలకు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతు సంక్షేమం వంటి అనేక సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను ప్రజలకు అందజేశాడని ప్రజల గుండెల్లో వైయస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన చేసిన సేవలు రాష్ట్ర ప్రజలు మరువలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు,స్థానిక సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వామన్ రావు,గుడాల శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు ఎజాస్,దేవస్థానం డైరెక్టర్ అశోక్,వరప్రసాద్, సర్పంచ్ సల్ల సమ్మిరెడ్డి. రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్ రావు.నాయకులు. రాంమోహన్ ,కోట సమ్మయ్య, అయిత తిరుపతి రెడ్డి,బుర్రి శివరాజ్,చేకూర్తి శంకర్, రాఘవేంద్ర, దాగం సంతోష్, జగదీశ్, చెక్రి, నేన్నేల గట్టయ్య,వార్డు సభ్యులు అశ్రర్ ఖురేషి,హరీష్, గడ్డంస్వామి, నాయిమోద్దీన్, చంద్రశేఖర్, చెన్నూరి వెంకటయ్య, తలారి గట్టయ్య, మోతే సమ్మయ్య, సమ్మయ్య,షకీల్,దేవేందర్, లక్ష్మీనారాయణ, చిప్ప జయంత్,జీవన్,మాచర్ల అరుణ్, మహేష్, తదితరులు కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

## ఆత్మకూర్ పోలీస్ స్టేషన్

### నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాబు లాల్ బాధ్యతల స్వీకరణ





**ఆత్మకూర్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ ( స్టేషన్ హౌస్ ఆఫీసర్) గా బాబు లాల్ బుధవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2009 బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారి. గతంలో ఆయన గీసుకొండ, వరంగల్ ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ విభాగాలలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి,సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. బదిలీపై వచ్చిన ఆయన బుధవారం రోజు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ బాబు లాల్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేరాల నియంత్రణకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించవచ్చని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

## శ్రీకృష్ణుడి ఆశీస్సులతో యాదవుల ఐక్యత చాటుదాం




**దేవరుప్పుల సెప్టెంబర్ 2(జనం సాక్షి)** జనగామ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 4న ఘనంగా నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు దేవరుప్పుల మండలంలోని యాదవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని యాదవ సంఘం నాయకులుపిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన గోడపత్రికను యాదవ సంఘం నాయకులు ఆవిష్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను ఘనంగా నిర్వహించాలని వారు కోరారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో యాదవుల ఐక్యతను చాటేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు తోటకూరి పాండు కృష్ణ సుడిగాలి హనుమంతు తోటకూరి కిష్టయ్య దశరథ జక్కుల గంగరాజు కాసాని సత్తయ్య తోటకూరి రమేష్ రాసాల బయ్యులు తోటకూరి దూదయ్య నర్సయ్య పులిగిళ్ళ సోమ నర్సయ్య నిలరపు చిన్న వెంకన్న పులిగిళ్ళ ఎల్లయ్య జక్కుల కుమార్ యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తారాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ల్యాప్‌టాప్‌ల పంపిణీ

### ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి







**కాజీపేట సెప్టెంబర్ 2 (జనం సాక్షి)** మడికొండ బాలవికాస స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో వరంగల్ జిల్లా పరిధిలోని తారాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంప్యూటర్ ల్యాబ్‌కు ల్యాప్‌టాప్‌లను మంజూరు చేశారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి ప్రత్యేక చొరవతో ల్యాప్‌టాప్‌లను ఇప్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి కంప్యూటర్ ల్యాబ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యను అందించేందుకు బాలవికాస సంస్థ మరియు స్థానిక నాయకులు చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరి రెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, బాలవికాస ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

### అఖిల భారత రైతు కూలీ సంఘం

# రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయండి



**తొర్రూరు, సెప్టెంబర్ 2( జనం సాక్షి):** తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో (ఏ ఐ కె ఎమ్ ఎస్ )నేడు రాష్ట్ర9 మహాసభలను జయప్రదం చేయాలని స్థానిక కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ ఎంఎల్.న్యూ డెమోక్రసీ తొర్రూరు.డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం.విదేశీ లతో వాణిజ ఒప్పందాలను వెంటనే ఉపసంహరించుకోవాలి.ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు మండిపడ్డారు. ప్రభుత్వాలు హామీలకే పరిమితమయ్యారు కానీ రైతాంగాన్ని విస్మరించారు అని అన్నా రు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కేటాయించకుండా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రభుత్వాలు కొమ్ముకాచుతున్నాయని మండిపడ్డారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని లేకుంటే అనేక ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద రైతులకు అనుసంధానం చేయాలని వారి డిమాండ్ చేశారు. ఏ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికీ వెయ్యి రోజులు గడుస్తున్నది అని పండుగ చేసుకున్నటువంటి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి ఆరు. గ్యారంటీలుఎక్కడ అమలు చేసారో చెప్పాలని వారు.డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించే దిశలో అఖిల భారత రైతు కూలీ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని వారు అన్నారు. అందులో భాగంగా ఈనెల 8 9 తేదీలలో మంచిర్యాల జిల్లా లో రైతు కూలీ సంఘం 9వ మహాసభలను నిర్వహించుకుంటున్నామని ఈ మహాసభలను రైతాంగం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరా యకన్న,తండా సురేష్ ,వెంకన్న, లింగన్న ,మధు, కృష్ణ, సోమయ్య, ఐలమ్మ ముత్తమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైంది

### మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్



**చిట్యాల , సెప్టెంబర్ 02(జనం సాక్షి ):** మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని నైన్ పాక గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 1000 రోజుల కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిరసనగా బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొర్రె సాగర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్,.ఎసి.హెచ్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు ఘొటం నవీన్, మాజీ సర్పంచ్ పులి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్ రావు, ఉప సర్పంచ్ గడ్డి రాములు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్టేకోళ్ళ రాజు, వార్డు సభ్యులు మేకల సతీష్, కొమురే శ్రీను, ఎర్రబెల్లి సుధాకర్, సంధాన్ ఈర్ల మల్లక్క, కుసుంబ సాంబయ్య, మంద గోపి, మంద రమేష్, మెండు రవీందర్, చిలుకమారి భాస్కర్, శ్రీపతి తిరుపతి, చిన్నాల వెంకన్న, మారపల్లి కుమార్, సావాటి రవి, పెండెల సంజీవ్, ఎర్రబెల్లి ప్రభాకర్, ఎర్రబెల్లి సారయ్య, కైరిక రాజు పటేల్, కంకణాల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల లోపు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**కాళేశ్వరం , సెప్టెంబర్ 02 , ( జనం సాక్షి)** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం దేవాలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కాళేశ్వరం దేవాలయాన్ని సందర్శించి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్ అండ్ బి, ఇరిగేషన్, దేవాలయ అధికారులతో పాటు సివిల్, స్టోన్ వర్క్ కాంట్రాక్టర్లతో కలిసి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. మే పునర్నిర్మాణ పనులు పూర్తయ్యేలా అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రతి నెలా పూర్తి చేయాల్సిన పనులకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాలు, టైమ్ లైన్ రూపొందించుకొని, వాటి ప్రకారం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవాలయ నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణంలో నాణ్యమైన కృష్ణ శిలలను తెప్పించి అవసరమైన కార్వింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాతి పనులను వేగవంతం చేసేందుకు ముగ్గురు కాంట్రాక్టర్లతో పనులు కొనసాగించాలని, సివిల్ నిర్మాణ పనులను కూడా సమాంతరంగా వేగవంతం చేయాలని సూచించారు. పురాతన నిర్మాణాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆలయ చారిత్రక ప్రాధాన్యత, నిర్మాణ నాణ్యత, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పనిని పకడ్బందీగా పూర్తి చేయాలని



సూచించారు. ఆర్ అండ్ బి, ఇరిగేషన్, దేవాలయ అధికారులు, కాంట్రాక్టర్లు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని, పనుల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ ఈ రమేష్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, దేవాలయ ఈఓ మహేష్, సివిల్, స్టోన్ వర్క్ కాంట్రాక్టర్లు, ఇరిగేషన్ మరియు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ బాలాలయంను సందర్శించారు.ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ శ్రీ ఆది ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బాలాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకులు జిల్లా కలెక్టర్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ శేష వస్త్రాలను బహూకరించి, స్వామివారి ప్రసాదాన్ని అందచేశారు.ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, పీఆర్ ఈఈ విద్యాసాగర్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ, ఇతర వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మ్ ఫౌండ్ తో రైతులకు ఎంతో ప్రయోజనం

### అడిషనల్ డీఆర్‌డీఓ భూక్యా సురేందర్ నాయక్

**చిట్యాల, సెప్టెంబర్ 02( జనం సాక్షి):** వీబీ జి రామ్ జి పథకంలో భాగంగా ఫార్మ ఫౌండ్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని అడిషనల్ డి ఆర్ డి ఓ భూక్య సురేందర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని రైతు ఇజ్జిగిరి శ్రీనివాస్‌కు వీబీగ్రాంజీ పథకం కింద మంజూరైన ఫార్మ్ పాండ్ పనులను అడిషనల్ డీఆర్‌డీఓ భూక్యా సురేందర్ నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సురేందర్ నాయక్ మాట్లాడుతూ.. ఫార్మ్ పాండ్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. పంటలకు రక్షణ కల్పించడంతో పాటు భూగర్భ జలాల వృద్ధికి, చేపల పెంపకానికి కూడా ఫార్మ్ పాండ్‌లు ఉపయోగపడతాయని వివరించారు. అలాగే నీటి లభ్యత పెరగడం వల్ల రైతుల వ్యవసాయ ఆదాయం పెంచుకోవడానికి, పంటల ఉత్పాదకత మెరుగుపర్చుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు.అదేవిధంగా ఇంకుడు గుంతలు, ఊటకుంటలు వంటి నీటి సంరక్షణ పనుల ద్వారా వర్షపు నీటిని



భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, నీటి నిల్వలు పెరగడం వల్ల గ్రామాల్లో నీటి సమస్యలను తగ్గించవచ్చని సురేందర్ నాయక్ వివరించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ తౌటం నవీన్, ఏపీఓ ఎండీ అలీం, టీఏ సుధాకర్, రైతు ఇజ్జిగిరి శ్రీనివాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# కిష్టంపేట, రేపల్లెవాడ గ్రామాల్లో కేవీకే శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

### రైతులకు పంట యాజమాన్య సూచనలు

**తాండూర్, సెప్టెంబర్ 02(జనం సాక్షి):**మంచిర్యాల జిల్లా: తాండూర్ మండలంలోని కిష్టంపేట మరియు రేపల్లెవాడ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి శాస్త్రవేత్తల బృందం బుధవారం విస్తృతంగా క్షేత్ర సందర్శన నిర్వహించింది. ఈ పర్యటనలో భాగంగా స్థానిక పొలాల్లో సాగవుతున్న పత్తి మరియు వరి పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించి, ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పలు కీలక సూచనలు మరియు సలహాలు అందించారు.పత్తిలో కలుపు నివారణకు శాస్త్రవేత్తల సూచన:ప్రస్తుతం పత్తి పంటలో ఎదురవుతున్న కలుపు సమస్యను పరిశీలించిన శాస్త్రవేత్తలు, దీని నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు. గడ్డి జాతి మరియు వెడల్పాటి ఆకు కలుపు మొక్కలను ఒకేసారి సమర్థవంతంగా అరికట్టడానికి ఎకరాకు 250 మి.లీ. చొప్పున క్విజాలోఫాప్ ఇథైల్ మరియు పైరిథియోబాక్ సోడియం మందులను కలిపి తగినంత నీటిలో మిక్స్ చేసి పిచికారీ చేయాలని సిఫార్సు చేశారు.సమస్యాత్మక నేలల్లో వరి సాగు జాగ్రత్తలు:అనంతరం వరి పొలాలను సందర్శించిన బృందం, చౌడు మరియు క్షార గుణాలున్న సమస్యాత్మక నేలల్లో పంట పరిస్థితిని సమీక్షించింది. ఇటువంటి నేలల్లో నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచడం వల్ల వేర్లకు ఆక్సిజన్ అందక మొక్కలు పచ్చబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల పొలంలో నీటిని నిరంతరం ఉంచకుండా, అవసరాన్ని బట్టి ఆరబెట్టి తడపడం అనే విధానాన్ని పాటించాలని సూచించారు.నేల సమస్యల వల్ల వేర్ల ద్వారా పోషకాలు అందడం కష్టమవుతుందని, అందుకోసం 19:19:19 లేదా మల్టీ-కే వంటి నీటిలో



కరిగే ఎరువులను ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు నత్రజని, భాస్వరం, పొటాషియం నేరుగా అందుతాయని వివరించారు. అలాగే, ఈ నేలల్లో భూసారాన్ని మెరుగుపరిచేందుకు తదుపరి పంట వేసే ముందు జీలుగ లేదా జనుము వంటి పచ్చిరొట్ట ఎరువుల పంటలను సాగు చేసి భూమిలోనే కలియదున్నడం ద్వారా సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.:ఈ కార్యక్రమంలో కేవీకే బెల్లంపల్లి శాస్త్రవేత్తలు డా. మధు, డా. ఎన్. మహేష్, శ్రీమతి పి. సాధ్వీలతో పాటు తాండూర్ మండల వ్యవసాయ అధికారి సుష్మ, వ్యవసాయ విస్తరణ వెంకటేష్ మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు



**చిట్యాల, సెప్టెంబర్02(జనం సాక్షి ):** చిట్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు...ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్ పాల్గొని చిత్ర పటానికి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ పింగిలి జ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య,జిల్లా కార్యదర్శి చిలుకల రాయకోమురు, సర్పంచులు కాసం మాధవి,రాజిరెడ్డి,పర్లపల్లి రవి,కొడారి ఓదెలు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, మాజీ సర్పంచులు కొక్కుల సదానందం, టౌన్ అధ్యక్షులు గంగాధర రవీందర్మా,జీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, గడ్డం కొమురయ్య,బుర్ర లక్ష్మణ్ గౌడ్, క్యాతం మార్కండేయ, పింగిలి సతీష్ రెడ్డి, సదయ్య గుర్రపు నర్సయ్య ఏకు కిషన్, నవాబుపేట గ్రామ శాఖ అధ్యక్షుడు మోత్కూరి సాయికృష్ణ, కైలాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత

### వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్




**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 02 (జనం సాక్షి):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కమాలుద్దీన్, మహమూద్ పాషా, కోదాటి అనిల్, కూచన రవీందర్, గిన్నారపు రాజు, కుతుజ్, జన్ను ఆదాం, అమృత రావు, బండ్ల సురేందర్, యూత్ నాయకులు నిశాంత్, వినోద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థానం

### :దావెరా అనిల్ కుమార్




**దేవరుప్పుల, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా దేవరుప్పుల మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెరా అనిల్ కుమార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో కాసారపు ధర్మారెడ్డి, నాగరాజు, ఓడపల్లి రవి, జాకీర్, మాసంపల్లి మహేందర్, జక్కుల గంగరాజు, తోటకూరి రమేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్ల మండల కేంద్రంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

# నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి



**టేకుమట్ల సెప్టెంబర్ 02 జనంసాక్షి** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కీ.శే. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా టేకుమట్ల మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన టేకుమట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత. ముఖ్యమంత్రిగా ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయి. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా సామాన్య ప్రజలకు అండగా నిలిచారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే గొప్ప లక్ష్యంతో తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, వారి మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసిన వైఎస్సార్ ప్రజా సేవా స్ఫూర్తి నేటి తరానికి కూడా ఆదర్శం. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం వైఎస్సార్ చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని మండల అధ్యక్షులు తిప్పి రెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల జిల్లా నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: బీజేపీ



**తాండూర్, సెప్టెంబర్ 02(జనం సాక్షి)**రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందని బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తాండూరు మండలం మాదారంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి ఫోటోతో కూడిన ఫ్లకార్డ్స్ తో నిరసన చపట్టారు.కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర కార్యాలయంపై,సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటంపై నలుపు రంగు చల్లి అవమానించడం కాంగ్రెస్ పార్టీ విధానానికి నిదర్శనమేనని అన్నారు.ఎస్సీ సమాజం మనోభావాలను దెబ్బతీసే చర్య అన్నారు. రాజకీయ భేదాలు ఉండవచ్చు కానీ మహనీయుల చిత్రాలను అవమానించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.ఎస్సీ సమాజానికి న్యాయం కావాలి. ఎస్సీ సమాజం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడటం లేదు.రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలే మా డిమాండ్.ఎస్సీలకు ఇచ్చిన హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా కాలపరిమితితో అమలు చేయాలి.ఎస్సీ డిక్లరేషన్ హామీలపై ప్రశ్నలు, ఎన్నికల సమయంలో ఎస్సీ సమాజానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలి. ఎస్సీ డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రతి హామీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. ఏ హామీ అమలైంది? ఏది అమలు కాలేదు? ఎంత నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలను ప్రజల ముందు ఉంచాలి. విద్య, ఉద్యోగాలు, గృహాలు, భూమి, ఆర్థిక సాధికారత, సంక్షేమ పథకాల విషయంలో ఎస్సీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.విద్యార్థుల సమస్య ఎస్సీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు ఆగిపోయే పరిస్థితి రాకూడదు.విద్యే ఎస్సీ సమాజం అభివృద్ధికి ప్రధానమైన మార్గం కాబట్టి విద్యకు సంబంధించిన హామీలను అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలి.ఆత్మగౌరవం కోసం పోరాటం సంత్ రవిదాస్ మహారాజ్‌ను అవమానించడం అంటే ఆయన చూపిన సమానత్వ మార్గాన్ని అవమానించడమే. ఎస్సీ సమాజం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో తన ఆత్మగౌరవం కోసం పోరాడుతుంది. సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటాన్ని అవమానించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసిచట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎస్సీ సమాజం యొక్క ఆత్మగౌరవాన్ని కాపాడాలి. ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. హామీల అమలుకు స్పష్టమైన కార్యాచరణ, కాలపరిమితిని ప్రకటించాలి. ఎస్సీ సమాజానికి న్యాయం జరిగే వరకు మా ప్రజాస్వామ్య పోరాటం కొనసాగుతుంది.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, బిజెపి జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్,మండల కార్యదర్శి గాదె రాజేశం,మండల నాయకులు ఆవుల చందు, ఆనంద్, త్రినాథ్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# పంట కుంట పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



**నెన్నెల, సెప్టెంబర్ 2 (జనం సాక్షి )** చిత్తాపూర్, సెప్టెంబర్ 2 చిత్తాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో వి.బి.జి. రామ్ పథకంలో భాగంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సంబంధించిన పంట కుంట పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పరిశీలించారు. పనుల పురోగతిపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కువ మంది రైతులకు పంట కుంట పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు పంట కుంటల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి, అర్హులైన రైతులను గుర్తించి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీడీవో పూర్ణచంద్రరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ వేదాల శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఈసీ స్వామి, పంచాయతీ స్రవంతి, సాంకేతిక సహాయకురాలు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**తొర్రూరు, సెప్టెంబర్ 02 ( జనం సాక్షి):** తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సందర్భంగా నాయకులు పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలకు తొరూరు మండల శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జనసేన పార్టీ ఆశయాలను సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేస్తూ, ప్రజా సమస్యలపై పోరాడడానికి జనసేన పార్టీ సిద్దంగా ఉంటుందని తొర్రూరు మండల జనసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం నాయకులు కుంభం మహేష్ కుమార్ గౌడ్, జక్కుల ప్రసాద్, గట్ల సతీష్, చింతల మధు, బుదారపు వెంకటేశ్వర్లు, పస్తం లక్ష్మణ్,దేవరకొండ భరత్, జాలిగామ శోభన్,ప్రవీణ్, యాకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే వంటా వార్పు కార్యక్రమానికి

# అనుమతి కోరుతూ సీఐకి వినతిపత్రం అందజేత




**చిట్యాల, సెప్టెంబర్ 02(జనం సాక్షి):** ఈ నెల 4వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వంటా వార్పు కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు చిట్యాల సీఐకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ప్రభుత్వ దప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అనుమతి మంజూరు చేయాలని సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి రెడ్డి, జనరల్ సెక్రటరీ మడికొండ రవీంద్ర రావు, మండల యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్, చిలుముల రమణాచారి పాల్గొన్నారు.

# ఎల్లాయగూడెంలో పారిశుద్ధ్య పనులు

## దోమల మందు ఫాగింగ్ చేయించిన గ్రామ సర్పంచ్ జినుకల కనకమల్లు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ జినుకల కనకమల్లు పారిశుద్ధ్య పనులను చేయించారు. బుధవారం గ్రామంలోని రోడ్లకు ఇరువైపుల ఉన్న సైడ్ డ్రైనేజీలను గ్రామపంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. అలాగే గడ్డి మందును పిచికారి చేయించారు.అంతేకాక రాత్రి గ్రామంలోని వీధులలో దోమల మందును ఫాగింగ్ చేయించారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్ గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ ధ్రువీకరణ పత్రం కోసం లంబాడీలకు తప్పని తిప్పలు

### 1954 నాటి భూమి పత్రాలు అడగడంపై ఆవేదన

### సమస్య పరిష్కరించాలని ఎస్టీ కమిషనర్ కు వేడుకోలు



**నెరడిగొండ సెప్టెంబర్2(జనంసాక్షి):**లంబాడీ కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు 1954 నాటి భూమికి సంబంధించిన ఖస్రా ఫాని,రెవెన్యూ రికార్డులు సమర్పించాలని అధికారులు కోరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు ఆదిలాబాద్ జిల్లా లైవ్ అధ్యక్షులు మహేందర్ జాధవ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుధవారం రోజున గిరిజన లంబాడీ హక్కుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్టీ కమిషనరేట్ ముట్టడి లో భాగంగా హైదరాబాద్ లోని ఎస్టీ కమిషనర్ కార్యక్రమంలో కమిషనర్ ను కలసి ఎస్టీ లంబాడీల కుల సర్టిఫికెట్ కై ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అడగని పత్రాలను ప్రస్తుతం తప్పనిసరిగా కోరడంతో కుల ధ్రువీకరణ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.1954 ప్రాంతంలో తమ పూర్వీకులకు వ్యవసాయంపై పెద్దగా అవగాహన లేకపోవడంతో పశువులను మేపుకుంటూ వలస జీవనం సాగించేవారని,1977 నుంచి క్రమంగా వ్యవసాయంపై దృష్టి సారించి స్థిర జీవనం ప్రారంభించామని,తమ వద్ద 1977 నాటి ఓటరు జాబితా మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొంటున్నారు. అంతకుముందు జరిగిన ఎన్నికల ఓటరు జాబితాలు ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉండే అవకాశం లేదని అంటున్నారు.పాత రికార్డులు లేవన్న కారణంతో ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ కాకపోవడంతో గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాలు,ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పాత రికార్డుల విషయంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఆధారాలతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.లంబాడీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు.కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైవ్ అధ్యక్షులు మహేందర్ జాధవ్ చీఫ్ కోఆర్డినేటర్ రమేశ్ నాయక్ సోమేశ్ నాయక్ చౌహన్ విలాస్ మండల ఇంచార్జి అరవింద్ జాధవ్ రాందాస్ రాథోడ్ ప్రవీణ్ మంగులాల్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయాలి



**బోథ్, సెప్టెంబర్02(జనంసాక్షి)**రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జేఎస్టీ సెక్రటరీ గోండ్ల భోజరాజ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలల్లో చదువులు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.బకాయిల ఆలస్యంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగి, కొందరు మధ్యలోనే విద్యను నిలిపివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు.కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యాలు నిలిపివేయకుండా వెంటనే అందించేలా ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు తుడసం భీమ్‌రావు, మారుతి, కొండమడుగు గణేష్, ఆంత్రం ధర్మన్న తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గోధుమ మొలకల నిమజ్జనం

### ఘనంగా ముగిసిన తొమ్మిది రోజుల తీజ్



**జైనుర్, సెప్టెంబర్ 2(జనం సాక్షి)**మండలం లోని శివనూర్ గ్రామంలో,బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన మొలకల పండుగ తీజ్ అని బీజేపీ ఎస్టీ మోర్చా ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సందీప్‌కుమార్ అన్నారు. తెలంగాణలోని బంజారా తండాల్లో తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈ పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు.తీజ్ వేడుకల్లో అవివాహిత యువతులదే ప్రధాన పాత్ర అని తెలిపారు. వారు ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్టమట్టితో బుట్టల్లో గోధుమలను విత్తుతారని, తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీరు పోసి మొలకలు పెంచుతారని వివరించారు.ప్రకృతి ఆరాధనలో భాగంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్ మహారాజ్, ఇతర దేవతలను ప్రార్థిస్తారని సందీప్‌కుమార్ తెలిపారు. భజనలు, సంప్రదాయ పాటలతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు.తొమ్మిదో రోజు గోధుమ మొలకలను తలపై పెట్టుకుని యువతులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ సమీపంలోని చెరువు లేదా నది వద్దకు వెళ్లి నిమజ్జనం చేయడంతో పండుగ ముగుస్తుందని తెలిపారు. బంజారాల ఐక్యతను చాటడంతో పాటు వారి ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు తీజ్ వేడుకలు దోహదపడతాయని సందీప్‌కుమార్ పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పోరుబాట

### బోథ్‌లో బీఆర్ఎస్ భారీ ధర్నా



**బోథ్, సెప్టెంబర్02(జనంసాక్షి):**కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బోథ్‌లో భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఈ కార్యక్రమం జరిగింది.ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, బోథ్ నియోజకవర్గ ప్రజల హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు,బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ వర్ధంతి వేడుకలు



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 02(జనంసాక్షి):**ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిసిసి జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తున్నారన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, అసంఘటిత కార్మిక వర్గానికి అన్ని రంగాలలో సంక్షేమ పథకాలను అందించిన మహనీయుడని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో వైఎస్ స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు దాముఖ శిరీష, బీమా మల్లేష్, కూతురు ప్రభాకర్, గుర్రం శ్రీనివాస్, నాయకులు కాసర్ల ప్రకాష్, పనాస రాజు, గోపు రాజం, సత్యనారాయణ, సురేందర్, రాజేష్ బొద్దుల ప్రేమ్ సాగర్, రమేష్, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వాగ్దానం చేసిన హామీలను వెంటనే అమలు చేయాలి

### బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సట్ల రవి గౌడ్



**టేకుమట్ల సెప్టెంబర్ 02 జనంసాక్షి :**టేకుమట్ల మండలం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ రామారావు పిలుపు మేరకు, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశానుసారం బీఆర్ఎస్ టేకుమట్ల మండల నాయకుల ఆధ్వర్యంలో టేకుమట్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ "హామీల బాకీ కార్డులు" పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ,మాజీ ఎంపీపీ రెడ్డి మల్లా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి,సీనియర్ నాయకులు ఆది రఘు,బండెల నరేష్,పోతనవేన. ఐలయ్య ,పింగిలి వెంకటేశ్వరరెడ్డి, ఉద్దమారి. మహేష్,మారం లింగా రెడ్డి,నర్సింగ రావు,సాద. మహేందర్,ఎల్లస్వామీ, మాదారపు.కుమార స్వామి, సముద్రాల. మొండయ్య,ప్రజాప్రతినిధులు,మాట్ల శ్రీనివాస్,రాం దేవేందం,ఎలావేన. నర్సయ్య,చిమ్మన్నవేన. శ్రీకాంత్,నాయకులు పోతన వేన.అరుణ్ కుమార్,బాపు రావు, గోపాలు,తుమ్మల నాగరాజు ,అన్నయ్య, సరోత్తం,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతుల సమస్యలపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

### బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** నేడు గురువారం రైతుల సమస్యలపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుబిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, బిఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ లు బుధవారం తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నేడు ఉదయం 10 గంటలకు చెన్నారావుపేట మండల కేంద్రంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నదాతల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు, గ్రామాలలోని రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# బిఆర్ఎస్ భారీ ర్యాలీ బాకీ కార్డుల ప్రదర్శన

- ప్రభుత్వ వైఫల్యాలను చూపడానికి ఈ ప్రదర్శన
- నియోజకవర్గ ఇన్చార్జి ఝూన్సన్ నాయక్



ఖానాపూర్ సెప్టెంబర్ 02 (జనం సాక్షి) కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు చూపడానికే ఈ భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భూక్య ఝూన్సన్ నాయక్ అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుండి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు వెయ్యి రోజులు, 33 నెలలు పరిపాలన పూర్తి చేసుకున్నప్పటికీ హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. పింఛన్లు రెట్టింపు చేస్తామని ప్రకటించి ఇప్పటికీ పెంచకపోవడం శోచనీయమన్నారు. ప్రతి వర్గానికి ఏదో ఒక ప్రలోభాన్ని చూపి ఎన్నికల్లో బురిడీ కొట్టించిన కాంగ్రెస్ పాలకులు ప్రజలకు పూర్తిగా మోసం చేశారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో కూడా ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందని ఆయన అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పెడచెవిన పెట్టిందని ఆయన ఆరోపించారు. బాకీ కార్డుల ప్రదర్శన ప్రభుత్వానికి ప్రజలకు పడ్డ బాకీ ని గుర్తు చేయడానికట్టట ప్రదర్శించామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ముందు వరుసలో నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ బాధ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి







**నెన్నెల, సెప్టెంబర్ 2 (జనం సాక్షి )** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం నెన్నెల మండలంలో పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. చిత్తాపూర్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న వి.ఓ. భవన పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి చిన్నారులు, విద్యార్థులకు అందుతున్న సేవలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. బేస్లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అదనపు తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ, దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదుపై సమీక్షించారు. అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. చిత్తాపూర్లో పంట కుంట నిర్మాణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ గ్రామస్థులతో మాట్లాడి పంట కుంటల ప్రయోజనాలను వివరించారు. వర్షపు నీటిని సంరక్షించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత పెంచుకునేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నెన్నెల మండల సమాఖ్య ఆధ్వర్యంలోని యూనిఫాం కుట్టు కేంద్రాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన కొనసాగుతున్న సివిల్ పనులను పరిశీలించి మిగిలిన పనులను వేగవంతం చేయాలని, విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీర్ను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు, ఆపార్ వివరాల నమోదుపై సమీక్షించి ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఏపీవో, ఏపీఎం, సర్పంచ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేచిని - అచలాపూర్ చౌరస్తాలో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



**తాండూర్, సెప్టెంబర్ 02(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా :బెల్లంపల్లి మండలం రేచిని – అచలాపూర్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ కూడలిలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం, వాహనదారులు అమిత వేగంతో ప్రయాణించడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఇక్కడ ప్రమాదాల తీవ్రత మరింత పెరిగింది.ప్రమాదాలకు కారణాలు:అతి వేగం: చౌరస్తా గుండా వెళ్లే వాహనాలు వేగాన్ని నియంత్రించకుండా ప్రయాణించడం.మలుపులు: రోడ్డు మలుపుల వద్ద సరిగ్గా కనిపించకపోవడం.రద్దీ: విపరీతంగా పెరిగిన వాహనాల రాకపోకలు.ప్రజల డిమాండ్:నిత్యం భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నామని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేచిని – అచలాపూర్ చౌరస్తా వద్ద తక్షణమే వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు (వేగ నిరోధకాలు) ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాద హెచ్చరిక బోర్డులను అమర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ప్రాణనష్టాన్ని నివారించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

# వైఎస్సార్ వర్ధంతి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు



**తాండూర్, సెప్టెంబర్ 02(జనం సాక్షి)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్ మాట్లాడుతూ వైఎస్సార్ తన హయాంలో ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజ్ రీఇంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో ఆయనను చిరస్థాయిగా నిలిపాయని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ కార్యకర్తలందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సొసైటీ మాజీ అధ్యక్షులు కంపెల చిన్నయ్య, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెద్దబోయిన రవీందర్, కో–ఆర్డినేటర్ మేడి శంకర్, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన రాజేశం (పప్పీ), ఉప్పుట్ల పోశం, మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# స్వర్గీయ డా.వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలను కొనియాడారు



**నెరడిగొండ సెప్టెంబర్2(జనంసాక్షి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి బుధవారం రోజున మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన హయాంలో ఆరోగ్య శ్రీ పథకం రైతులకు ఎకకాలంలో రుణమాఫీ ఫీజు రియంబర్స్మెంట్ గిరిజనులకు పట్టా భూములు 108 అంబులెన్స్ అనేక రకాల సంక్షేమ పథకాలను అయన హయాంలో చేసిన పనులను వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏలేటీ రాజశేఖర్ రెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ ఆడే వసంత్ రావ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్ చందర్ రెడ్డి జిల్లా సెక్రటరీ అగ్గు రమేష్ ఎస్సి సెల్ మండల అధ్యక్షులు లింగంపల్లి సురేష్ మైనాటరీ జిల్లా సెక్రటరీ వఖిల్,మైనార్టీ మండల అధ్యక్షుడు ఖాజా భాయ్ జాదవ్ వసంత్ పాల శంకర్ హీరసింగ్ రాతోడ్ వసంత్ చంద్రశేఖర్ భూషణ్ భీంరాజ్ గౌడ్ పెద్ద రెడ్డి అంజయ్య సాయన్న మైపాల్ సింగ్ హెమ్యా నాయక్ గోడం లక్ష్మణ్ రూప బాయి తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి



**నెన్నెల, సెప్టెంబర్ 2 (జనం సాక్షి )** నెన్నెల మండలంలో 22–ఏ నిబంధన కింద దాదాపు 3 వేల నుంచి 5 వేల మంది రైతులకు చెందిన భూములు నిషేధిత జాబితాలో చేరాయని బీజేపీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ తెలిపారు. ఆయా భూములను 22–ఏ నిబంధన నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. నేన్నెల్ మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ భూములకు సంబంధించిన సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. రైతులు పూర్తిగా నింపిన దరఖాస్తుతో పాటు పట్టా పాస్బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని సూచించారు. గతంలో రఘునాథ్ వెరబెల్లి కలెక్టర్కు ఫిర్యాదు చేసిన సందర్భంగా, 22–ఏ నిబంధనలో ఉన్న భూములకు సంబంధించి రైతులు దరఖాస్తులు, ఫిర్యాదులు సమర్పిస్తే పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు శేఖర్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్డీఓ కార్యాలయానికి హాజరై తమ పత్రాలను సమర్పించాలని కోరారు.

# మూల మలుపులు కావవి.. అవే మృత్యుపాశాలు

## కెరమెరి ఘాట్ లో నిత్యం ప్రమాదాలు పట్టించుకోని అధికారులు



**కెరమెరి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి)**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి ఘాట్ రహదారి ఇప్పుడు మృత్యు ఘాట్ గా మారింది. ఆసిఫాబాద్ నుండి ఉట్నూర్ వెళ్లే ప్రధాన రహదారిలోని కేరమేరి ఘాట్ లో ఉన్న ప్రమాదకర మూల మలుపులు వాహనదారుల పాలిట శాపంగా మారాయి. ప్రమాదాలకు నిలయంగా ఘాట్:ఈ ఘాట్ పొడవు సుమారు 7 కిలోమీటర్లు ఉంటుంది. ఈ దారిలో 6 కి పైగా గుడ్డి మలుపులు ఉన్నాయి. రోడ్డు వెడల్పు కేవలం 20 అడుగులు మాత్రమే ఉండటంతో రెండు పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పించుకోవడం కష్టంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పూర్తిగా గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. ఎదురుగా వచ్చే వాహనం కనిపించకపోవడం, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో దృశ్యం సరిగా కనిపించడం లేదు.గతం నుంచి ఈ ఘాట్ లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి మరణించిన వారు ఉన్నారు. వాహనాలు బోల్తా పడి పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడిన సందర్భాలు అనేకం. రాత్రి సమయాల్లో లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి లోయలో పడిన ఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉండడంతో వేగంగా వాహనాలు ఎదురెదురు వచ్చి ఢీకొనీ ప్రమాదానికి గురైన సందర్భాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. వాహనదారుల ఆవేదన:ఘాట్ లో స్పీడ్ బ్రేకర్లు లేవు, సరైన సూచిక బోర్డులు లేవు. రాత్రిపూట లైటింగ్ లేదు. మలుపు తిరిగే వరకు ఎదుట ఏ వాహనం వస్తుందో లేదో తెలియదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది" అని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసిఫాబాద్ -అదిలాబాద్ మధ్య నిత్యం వందలాది వాహనాలు, ాజ బస్సులు, లారీలు ఇతర వాహనాలు ఈ ఘాట్ మీదుగానే రాకపోకలు సాగిస్తాయి. ఆసిఫాబాద్, జైనూర్, ఉట్నూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లాలంటే ఆ ప్రాంత ప్రజలకు ఇదే ప్రధాన దారి.ప్రజల డిమాండ్ ఇదే: వెంటనే ఘాట్ రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డుగా మార్చాలి.ప్రమాదకర మలుపుల వద్ద కన్వెక్స్ అద్దాలు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించి, రోడ్డు పక్కన దెబ్బతిన్న క్రాష్ బారియర్లను మరమ్మత్తు చేయాలి.రాత్రి పూట ప్రయాణానికి లైటింగ్ సౌకర్యం కల్పించాలి.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి రహదారుల శాఖ అధికారులు ఊహించని ఘోర రోడ్డు ప్రమాదాలు జరగకముందే అప్రమత్తమై తక్షణమే స్పందించి కెరమేరీ ఘాటు విస్తరణకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వినాయకుడి నుండి సైబర్ భద్రత పాఠాలు

## పోస్టర్‌ను ఆవిష్కరించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 02 (జనం సాక్షి ):**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ ఆవిష్కరించారు.'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్‌లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీ సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకుని టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని తెలిపారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం స్టేషన్ ఏసీపీ వెంకటరమణ, సీఎసి బి 2 ఏసీపీ జానీ నర్సింహులు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్. ఐలు చరణ్, శివ పాల్గొన్నారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీ బీఆర్ఎస్ ది

## ఖమ్మం రైతులకు బేడీలు వేసిన చరిత్ర బిఆర్ఎస్ నాయకులది

## మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు ఫైర్



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :**బుధవారం హనుమకొండ డిసిసి భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ మీడియా సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య , ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య , హనుమకొండ వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి, ఎం డి ఆయుబ్ పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని సర్వం దోచుకతిని, దొంగే ఎదుటివాన్ని దొంగ అన్నట్టుగా వారు ప్రవర్తించే విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. తమ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు వారికి ప్రజలు ఇచ్చిన అవకాశాలు ఎన్ని వాగ్దానాలు, ఇంతవరకు నెరవేర్చామని తెలుసుకోవాలి అన్నారు.మాయమాటలతో అధికారంలోకి వచ్చి ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాలని తెలిపారు.ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన చరిత్ర బి ఆర్ ఎస్ ది అని ఆరోపించారు బిఆర్ఎస్ నాయకుల అహంకారానికి, అవినీతికి, నియంతృత్వ ధోరణులకు తెలంగాణ ప్రజలు చరమ గీతం పాడి కాంగ్రెస్ ప్రజా పాలనకు పట్టం కట్టారని అన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 రూ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్య శ్రీ పరిమితి 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంపు, నూతన రేషన్ కార్డులు, తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పీపుల్స్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ప్రారంభోత్సవం



**సెప్టెంబర్ 02(జనం సాక్షి ) గోవిందరావుపేట:** బుధవారం నాడు గోవిందరావుపేట మండలం కోయగూడెంలో పీపుల్స్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేసిన పాఠశాలను రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పేద విద్యార్థుల కోసం పీపుల్స్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ వారు చేస్తున్న సేవలను మంత్రి సీతక్క అభినందించారు.వారు పాఠశాలను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని వారు ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేసి మంచి గుర్తింపు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్. తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు కొట్టెం అచ్చన్న, వజ్జన్న



**గూడూరు,సెప్టెంబర్02(జనంసాక్షి):**అఖిల భారత రైతు కూలీ సంఘం(ఎఐకేఎంఎస్ ) రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు కొట్టెం అచ్చన్న,వజ్జన్నలు పిలుపునిచ్చారు.బుధవారం గూడూరు మండలం మచ్చర్ల,పాటిమిది గుంపు, కొంరాంభీమ్ నగర్ లలో మహాసభ పోస్టర్స్ ను ఆవిష్కరించినారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.సెప్టెంబర్ 8,9 తేదీలలో మంచిర్యాల పట్టణంలో నిర్వహించనున్న అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు..రైతులు,కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కొట్టెం అచ్చన్న,వజ్జన్నలు పేర్కొన్నారు.ఈ మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో నాయకులు కడబోయిన నర్సయ్య,అడ్డురి వెంకన్న, పగిడిపాల రామనాదం,సారయ్య,రమేష్,నరేష్,రామక్క,వినోద,లక్ష్మి,సమ్మక్క,నర్సక్కశాంత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి భవన్ లో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని హన్మకొండలోని డీసీసీ కార్యాలయంలో . హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు డిసిసి అధ్యక్షులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి ఘన నివాళు లు అర్పించారు అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, భత్తిని శ్రీనివాస్ రావు, వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక, ఐవైసీ జాతీయ కార్యదర్శి గొట్టిముక్కుల సాగరిక, డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన ప్రజాసేవలను ఈసందర్భంగా స్మరించుకున్నారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల ప్రస్తుత, మాజీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# తెలంగాణలో అటుకెక్కిన రైతు బీమా పథకం

### పిడిసిల్ల మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి బి ఆర్ ఎస్ నాయకులు ప్రెస్ మీట్



**మొగుళ్ళపల్లి జనం సాక్షి (సెప్టెంబర్ 2)**తెలంగాణలో రైతుల ఆత్మహత్యలను తగ్గించడానికి అప్పటి కెసిఆర్ ప్రభుత్వం రైతుబంధు అని, రుణమాఫీ అని, 24 గంటలు ఉచిత కరెంటు అని ఈ విధంగా అనేక పథకాలను రైతుకు అనుబంధంగా ప్రవేశపెట్టడం జరిగింది. వ్యవసాయం కోసం అప్పులు చేసి పంట రాక ఎవరైనా ఆత్మహత్యలు చేసుకుంటే వారి కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కోసం పరిహారంగా రైతు మరణించిన పది రోజుల్లోపు ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వమే పాలసీ డబ్బులు కట్టి బీమా కింద ఇప్పించడం జరిగింది.అట్టి మంచి పథకమును రైతులకు దూరం చేసే కుట్రలో భాగంగా రైతు బీమాను ఆగస్టు 14 తో గడువు ముగిసినప్పటికీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రెన్యువల్ చేయకపోవడం రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. ఆపదలో ఉన్న మరణించిన రైతు కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉపయోగపడే మంచి పథకమే రైతు బీమా పథకం. రైతు బీమా పథకమును అప్పటి ముఖ్యమంత్రి ఖజ= గారు రైతు ఆత్మహత్యల కుటుంబాలను ఆదుకోవడం కోసం 2018 లో దేశంలోనే మొదటగా వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలంలో ఈ పథకమును ప్రారంభించడం జరిగింది. కరోనా విపత్కర సమయంలో కూడా రైతు బీమా పథకాన్ని కెసిఆర్ కొనసాగించడం జరిగింది. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా ఆవశ్యకత గురించి తెలియక రైతు బీమాను అటుకెక్కించడం జరిగింది. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం తప్ప అది ఆచరణలో ఎక్కడ కనబడటం లేదు. మన మొగుళ్లపల్లి మండలంలోనే ఆగస్టు 14 తర్వాత ఇప్పటి వరకు 10 మంది పైగా రైతులు చనిపోవడం జరిగింది.రాష్ట వ్యాప్తంగా వందల రైతు కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 5 లక్షల రూపాయలు అందక రైతులు రోడ్డున పడడం జరిగింది వారిని ఏ విధంగా ఆదుకుంటారో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఎప్పుడో ఏదో చేస్తాం అని ఇప్పుడు రైతుల బీమా రెన్యూవల్ చేయకపోవడం అత్యంత బాధాకరం మరియు అనాలోచిత నిర్ణయం అని ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును తెలియజేస్తుంది. మీ తప్పిదం వల్ల చనిపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోకపోతే దీ=ూ పార్టీ ప్రజల పక్షాన నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించవలసి ఉంటుందని ప్రభుత్వమును హెచ్చరించడం జరిగింది.

# విద్యార్థులకు ఉచిత యూనిఫాం దుస్తుల పంపిణీ



**నెరడిగొండ సెప్టెంబర్2(జనంసాక్షి):**మండలంలోని లఖంపూర్ జి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను సెడమకి సుజాత గంగాధర్ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఏకరూప యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత యూనిఫాం దుస్తుల పంపిణీతో విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు అందరిలో సమానత్వ భావన పెంపొందుతుందని తెలిపారు.విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాథోడ్ తూకారం,అంగన్వాడీ టీచర్ మడవి గోదావరి వెలుగు సీసీ చంద్రకళ ఆత్రం గంగారాం విఓ విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

### పేదల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహానేత



**ఏటూరునాగారం,సెప్టెంబర్ 02(జనంసాక్షి).** మండల కేంద్రంలోని వై జంక్షన్ ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ పేరు చెబితేనే పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమం గుర్తుకు వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ అనేక చారిత్రాత్మక కార్యక్రమాలను అమలు చేశారని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం, 108 అత్యవసర సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, జలయజ్ఞం వంటి కార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేశారని, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. "ప్రజల కోసం పాలన.. పేదల కోసం సంక్షేమం" అనే ఆలోచనతో పనిచేసిన వైఎస్సార్ అభివృద్ధి అడుగుజాడలు నేటికీ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తోందని నాయకులు తెలిపారు. వైఎస్సార్‌ను స్మరించుకోవడం అంటే ఆయన ఆశయాలను ఆచరించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తదితరులు పాల్గొని మహానేతకు ఘనంగా నివాళులర్పించారు.

# అంబులెన్స్‌లను తనిఖీ చేసిన డీవైసీఎంవో



**రామకృష్ణాపూర్, సెప్టెంబరు02(జనంసాక్షి):** ఆర్కేపీ సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని అంబులెన్స్‌లను డీవైసీఎంవో డాక్టర్ మధుకుమార్ బుధవారం తనిఖీ చేశారు. అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్‌ల సన్నద్ధత, పనితీరును పరిశీలించారు. ఆక్సిజన్ సిలిండర్లు, ఫ్లో మీటర్లు, ప్రథమ చికిత్స కిట్లు, స్ట్రెచర్లు, ప్రాణరక్షక మందుల లభ్యతను తనిఖీ చేశారు. అలాగే వాహనాల ఫిట్‌నెస్, బ్యాటరీ, సైరన్ తదితర సాంకేతిక అంశాలను పరిశీలించారు. అత్యవసర సమయంలో గని కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి జాప్యం లేకుండా వైద్య సేవలు అందేలా అంబులెన్స్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమర్జెన్సీ కాల్ వచ్చిన వెంటనే స్పందించాలని, లాగ్‌బుక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 02 (జనం సాక్షి)** రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ బుధవారం సంబంధిత శాఖల, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణంలో పనులను, రోడ్డులో ఏర్పాటుతున్నా నీటి నిలువలు,గుంతలు వలన ట్రాఫిక్ జామ్, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.మార్కెట్ పరిధికి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలను, నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిర్ణీత ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి ఎడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో వరంగల్ సుమ, ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఆదుకోవడం మా బాధ్యత



**బచ్చన్నపేట సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** బచ్చన్నపేట మండల ఫోటోగ్రాఫర్ల సంఘం సభ్యులకు ఎవరికైనా ఆపద వస్తే ఆదుకోవడం సంఘం బాధ్యత అని మండల ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు సూత్రమె రమేష్ అన్నారు.బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేట మండల ఫోటోగ్రాఫర్ సభ్యుడు దూడం మహేష్ ప్రమాదవశాత్తు జారీ పడడం వల్ల కాలు విరిగినదని మానవతా దృక్పథం తో ఫోటోగ్రాఫర్ సభ్యులు అందరూ కలిసి 11600/- రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. మహేష్ త్వరగా కోలుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తన వృత్తిని కొనసాగించాలని ఫోటోగ్రాఫర్ సభ్యులందరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటోగ్రాఫర్ల యూనియన్ కార్యదర్శి నీల కుమారస్వామి. మచ్చ సతీష్ కుమార్. గంగరబోయిన నర్సింహులు .రాపెల్లి శాంతయ్య. తేలు నరేష్. కుమార్ .ప్రసాద్. రాపెల్లి శివ. మంగళపల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాల్లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## : ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గణేష్ ఉత్సవాల్లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన బి సైబర్ స్మార్ట్ అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగల సమయంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, క్యూఆర్ కోడ్లు, ఫోన్ కాల్స్, మెసేజ్లను నమ్మవద్దని, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివకుమార్, సైబర్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

## ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పోలీస్ ఉద్యోగ నియామక నోటిఫికేషన్ దృష్ట్యా జిల్లా యువతకు ఉచిత డేస్ స్కాలర్ శిక్షణ అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తోందని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 6 ఆదివారం ఉదయం 7 గంటలకు ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో శారీరక, రాత పరీక్షలు నిర్వహిస్తారని, అర్హత సాధించిన వారికి ఉచిత క్లాసులు, గ్రౌండ్ కోచింగ్ ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు జిల్లా స్థానికులై ఉండి స్థానిక పోలీస్ స్టేషన్లో రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, రెసిడెన్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అప్లికేషన్ ఫామ్, పాస్ పోర్ట్ ఫోటో తీసుకురావాలని సూచించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# పదవి బాధ్యతలు చేపట్టిన సీఐ కొండ్ర శ్రీను

## అభినందలు తెలిపిన నాయకులు



**జనం సాక్షి ఎల్క తుర్తి సెప్టెంబర్ 2 :**ఎలుకతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ కోండ్ర శ్రీను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనిగరపు వెంకటేష్ డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు సీనియర్ కాంగ్రెస్ నాయకులు . ఎర్రోళ్ల సతీష్ ఎర్రల్లో జీవన్ ఎర్రోళ్ల రాజేష్ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పులి రమేష్ ఎల్కతుర్తి భీమదేవరపల్లి మండలాలకు చేసిన సేవలు మరువలేనివని ఆయనఉద్యోగ రీత్యా బదిలి అవ్వడం బాధాకరం అని అన్నారు సిఐ గా కొండ్ర శ్రీను ఎల్క తుర్తి కిరావడం సంతోషకరమని ఈ సందర్భంగా అన్నారు

# బదిలీ వేళ.. సీఐకి ఆత్మీయ వీడ్కోలు



**దేవరుప్పుల, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** పాలకుర్తి సీఐగా విధులు నిర్వహించిన జానకిరామ్‌రెడ్డి బదిలీ కావడంతో దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ జానకిరామ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



**పెద్దవంగర సెప్టెంబర్ 02(జనం సాక్షి )** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రంగు మురళి ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగు మురళి మాట్లాడుతూ. వైయస్సార్ సేవలు మరువలేని రైతులకు నిరుపేదలకు బడుగు బలహీన వర్గాలకు ఎనలేని సేవలందించారు అన్నారు. ఈ కార్యక్రమంలో సంకెపల్లి రవీందర్ రెడ్డి, పొడిశెట్టి సైదులు, బండారు వెంకన్న, ఎండి రహీం, హరికృష్ణ,శ్రీనివాస్, నరేష్, మోహన్ రావు, సంపత్, సుభాష్ యాకయ్య,భాష, నరేష్, యాకన్నా,మహేందర్, తదితరులు పాల్గొన్నారు

# వైఎస్ఆర్ సంక్షేమ పాలన చిరస్మరణీయం

## బట్టు కరుణాకర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో పేదలు, రైతులు, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, 108, 104, పావలా వడ్డీ వంటి పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కరుణాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో పట్టణ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వైఎస్ఆర్ 17వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భువన సుందర్, చల్లూరు సమ్మయ్య, వెంకీ, మహేష్ యాదవ్, మాలతి, జంపన్న, పొనగంటి శీను, సహదేవుడు, అశోక్, మట్టెవాడ సురేష్, చల్లా రేణుక, శారద, పుష్ప, హైమద్, ఆఫీస్ గురజాల రవి, అప్పం కిషన్, అప్పల శ్రీనివాస్, భాస్కర్ నాయక్, సరేష్, మోహన్, అఖిల్, తిలక్, నాగరాజు, అస్లాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహానేత వైఎస్సార్ సేవాలు మరువలేనివి

## వర్ధంతి వేడుకల్లో.శీలం అనిల్ కుమార్



**జనంసాక్షి ఎల్క తుర్తి సెప్టెంబర్ 2 :**మాజీ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలమేరకు అంబేద్కర్ జంక్షన్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సేవలను,ఆయన ముఖ్యమంత్రిగా చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను స్మరించుకున్నారు.పేదలు,రైతులు, మహిళలు,విద్యార్థులు,బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ గోడిశాల రాజయ్య, మాజీ సర్పంచ్లు గోడిశాల యాదగిరి, కొమ్మిడి రాజిరెడ్డి,జనగాని లక్ష్మినారాయణ,సీనియర్ నాయకులు డాక్టర్ రమేశ్,పాక రమేశ్, శ్రీపతి సదా నందం, యువ నాయకులు గోడిశాల అర్జున్, గుడేల్లి నవీన్,అంచనగిరి వెంకట్,నాయకులు,ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు,కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అభివృద్ధి ప్రదాత వైయస్సార్

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి



**శాయంపేట, సెప్టెంబర్ 2 ( జనం సాక్షి)**బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి వారిని అభివృద్ధి పదంలోకి తీసుకొచ్చిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. సెప్టెంబర్ 2 ఆయన వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు రైతులు విద్యార్థులు మహిళల మరియు సామాన్య ప్రజల సంక్షేమశీ కోసం ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు మరవలేనివి అన్నారు.పేదవాడి ఆరోగ్యం గురించి ఆలోచించి ఆరోగ్యశ్రీ వంటి పథకాన్ని తీసుకొచ్చిన మహానేత వైయస్సార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హింగే భాస్కర్, మండల నాయకులు మారేపల్లి రవీందర్ ,చిందం రవి, దుబాస్ కృష్ణమూర్తి ,వైనాల కుమారస్వామి, శానం కుమారస్వామి, లడే రాజ్ కుమార్, రవిపాల్ ,పత్తి శీను, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టుకు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ జక్కా



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 2 ( జనం సాక్షి ):** మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ తాళ్ళ సురేందర్ రెడ్డి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం అతని మృతదేహం పై చెన్నారావుపేట మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ స్థానిక గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.వారి వెంట బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు మొర్రి కట్టయ్య, తిమ్మరాయన్ పహాడ్ గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్, ఉప సర్పంచ్ లింగాల సారంగం, వార్డ్ సభ్యులు మరపల వీరాస్వామి, బండి రమేష్, మరాఠి కట్టయ్య, గుర్రం రవి, బుడిగె నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మహానేతకు ఘన నివాళి



**బచ్చన్నపేట సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** ముఖ్యమంత్రి, దివంగత నేత డా. వై.యస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి బచ్చన్నపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు మహమ్మద్ మసూద్ ఆధ్వర్యంలో నాయకులు. కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ నాయకులు, జిల్లా, మండల నాయకులు, కిసాన్ సెల్, బీసీ సెల్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మరియు అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరూ అధిక సంఖ్యలో హాజరై నివాళి అర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంక్షేమ పథకాల ప్రదాత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి



**బయ్యారం సెప్టెంబర్ 2( జనంసాక్షి)** పేద ప్రజల సంక్షేమం కోసం,బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు పరచిన ప్రజానాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అని వక్తలు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని కొత్తపేటలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కారుబోతుల రామ్మూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా వై.ఎస్.ఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షులు జూలకంటి సీతారాం రెడ్డి,జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ గారు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, 108, 104 పథకాలు నేటికీ పేద ప్రజలకు వరంగా మారాయని అన్నారు. రైతు, విద్యార్థి, మహిళా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత వై.ఎస్.ఆర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ కుమార్, తమ్మిశెట్టి వెంకటపతి,రాంబాబు, బాలరాజు, చల్లా సురేష్, సంతు, రామయ్య,ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు. బయ్యారంలో జరిగిన కార్యక్రమంలో బస్ స్టాండ్ సెంటర్ లోని రాజీవ్ విగ్రహం వద్ద పట్టణ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వై ఎస్ ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ శాంతి,సొసైటీ చైర్మన్ బండారి మల్లయ్య, మాజీ ఎంపిపి కిషన్ నాయక్ ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు రేల అగిరెడ్డి,కంబాల ముసలయ్య, నాయకులు యశోద,నంద గిరి భద్రయ్య, తగిరె సత్యనారాయణ రెడ్డి,తాటి జనార్దన్, కనకటినారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ




**బచ్చన్నపేట సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలో అడపా దడపా కురిసిన వర్షాల కారణంగా గ్రామంలో దోమలు ఎక్కువగా ఉన్నాయని గ్రహించిన గ్రామ సర్పంచ్ కోడూరుస్వర్ణలత శివకుమార్ గౌడ్ వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే బుధవారం కొన్నె గ్రామంలో సిబ్బందితో వీధులు మొత్తం తిరిగి ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నీటి నిలువలు ఉండకూడదని అలాగే ఇంటి చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల నివారణకు తమ వంతు బాధ్యతగా దోమతెరలు వాడాలని సూచించారు.

# రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాటారం సెప్టెంబర్ 2 (జనం సాక్షి ):** బుధవారం కాటారం మండలం ధన్వాడ గ్రామంలో కొనసాగుతున్న డిజిటల్ భూ రీ-సర్వే పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తి చేసిన సర్వే వివరాలను ఎడి కుసుమ కుమారుని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు నోటీసుల జారీ ప్రక్రియ, సర్వే బృందాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సర్వే నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 70 గ్రామాల్లో కొనసాగుతున్న డిజిటల్ భూ పునఃసర్వే పనులను వేగవంతం చేసి, మొదటి విడత సర్వేను నవంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సర్వే పనులు మందకొడిగా సాగుతున్నందున వేగం పెంచాలని, ప్రతి మండలంలో రీ-సర్వే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే బృందాల సంఖ్యను పెంచడంతో పాటు రోవర్ పరికరాల కొనుగోలు ప్రక్రియను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లాలో లైసెన్సుడ్ సర్వేయర్లు 97 మంది ఉన్నారని అందరూ సర్వేలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లలో 54 మంది విధులకు హాజరు కావడం లేదని ఏడి కుసుమ కుమారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సెలింగ్ అనంతరం కూడా విధులకు హాజరుకాని పక్షంలో ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినట్లు భావించి లైసెన్సుల రద్దుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే డిజిటల్ భూ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, రికార్డులను అందుబాటులో ఉంచి సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సర్వే సిబ్బంది, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# నారక్కపేటలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



**నల్లబెల్లి, సెప్టెంబర్ 02 (జనంసాక్షి):** మండలంలోని నారక్కపేట గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. గ్రామ మహిళలు పోచమ్మ బోనాలు ఎత్తుకొని డబ్బు సప్పుల్లా నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు పోచమ్మ తల్లిని దర్శించుకుని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. చిన్నపిల్లలు పొర్లు దండాలు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు యాటపోతులు, కోళ్ల ను అమ్మవారికి బలిచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. బోనాల పండుగ తో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ప్రజలను వంచించిన కాంగ్రెస్

## మాజీ మంత్రి రెడ్యానాయక్ సవాల్



**డోర్నకల్ :సెప్టెంబర్ 2 (జనం సాక్షి)** మహబూబాబాద్ జిల్లా ,డోర్నకల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఘోరంగా వంచించిందని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బుధవారం పట్టణ కేంద్రంలోని గాంధీ కూడలిలో బిఆర్ఎస్ నిరసనలో మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఏ ఒక్క డిక్లరేషన్ కూడా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అబద్ధపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు.హామీల అమలుపై తాము ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే రావాలంటూ బహిరంగ సవాల్ విసిరారు.ప్రజలను మోసం చేసిన తీరుపై కాంగ్రెస్ సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే రిపోర్టర్ మదర్ ఖాన్ ను పరామర్శించారు. నాయకులు కత్తెరసాల విద్యాసాగర్, సర్పంచ్ రాయల వెంకటేశ్వరావు, మాజీ సొసైటీ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బోస్ వెంకన్న, బాణోత్ పాండునాయక్,తురక అనిల్,కౌన్సిలర్లు గుగులోతు రాము, బురగల శరత్,నంజ్యాల మధు,యశోదర్ జైన్, రాంభద్రం,రాంబాబు,భాస్కర్,మన్మథరావు,కొత్త వీరన్న,వేమూరు వెంకటేశ్వర్లు,కాడెం బాబు,ఉప సర్పంచ్ రమన బోయిన రాజు,కొత్త ఉపేందర్, సమ్మిరెడ్డి, గంధసిరి ఉపేందర్,గౌస్,శ్రీనివాస్, బోయినపల్లి నాగేశ్వరావు. తాళ్లూరి సతీష్, కాడెం ప్రశాంత్. సూర మధు,మాజీ సర్పంచ్ గమ్మిరాజు,పూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

# నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పెండ్యాల దేవేందర్ బాధ్యతల స్వీకరణ

**బచ్చన్నపేట సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** నూతన నర్మెట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్గా పెండ్యాల దేవేందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ విభాగం నుంచి బదిలీపై నర్మెట్ట సర్కిల్ సీఐగా దేవేందర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల పోలీస్ స్టేషన్ల ఎస్సైలు దేవేందర్ను మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. సీఐ శ్రీ దేవేందర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తు, విధి నిర్వహణలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేయాలని ఎస్సైలు, పోలీస్ సిబ్బందికి సూచించారు.




ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని దేవేందర్ తెలిపారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గతంలో మహబూబాబాద్ మరిపెడ సిఐగా సేవలందించారు.

# ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### బిసి, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ చెన్నారావుపేట మండల కన్వీనర్ అలువాల శ్రీనివాస్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ చెన్నారావుపేట మండల కన్వీనర్ అలువాల శ్రీనివాస్ అన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్, అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్ ల ఆదేశాల మేరకు చెన్నారావుపేట నాయబ్ తహసిల్దార్ పవన్ కుమార్ కు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ముఖ్యంగా బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలల్లో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థులకు ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అదే విధంగా ప్రభుత్వం కళాశాలలో చెల్లించే ఫీజులతో నిమిత్తం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీ యాజమాన్యం ఆపకుండా వెంటనే ఇచ్చేలా ఒక జోవోని విడుదల చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్రరి రమేష్, పసునూరి సామేలు, మంతెన బాబు, రూపిక నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో నిలిచిపోయిన నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తెప్పల దేవేందర్ రెడ్డి



**కాటారం సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెప్పల దేవేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 17 వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.సందర్భంగా తెప్పల దేవేందర్ రెడ్డి, నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైయస్ఆర్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు ఆయన పేదల ఆశాజ్యోతి, రైతుల ఆపద్బాంధవుడు, నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన మహానేత అని కొనియాడారు.రైతు కష్టాల్లో ఉన్నప్పుడు రైతుకు అండగా నిలిచిన నాయకుడు వైయస్ఆర్. పేదవాడి ఇంట్లో వెలుగు నింపాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కలలు కన్న గొప్ప నాయకుడు ఆయన. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదల సంక్షేమం వంటి అనేక రంగాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు కోట్లాది ప్రజల జీవితాలను ప్రభావితం చేశాయి.ప్రజల కోసం జీవించడం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయడంఅనే సిద్ధాంతాన్ని తన జీవితంలో ఆచరించి చూపిన నాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వారు తెలిపారు.ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా, ఆయన చేసిన సేవలు ఆయన చూపిన మార్గం ఆయనపై ప్రజలకున్న ప్రేమ ఎప్పటికీ చెరిగిపోవు.వర్ధంతి సందర్భంగా మనం ఆయనకు కేవలం పూలతో నివాళులు అర్పించడం మాత్రమే కాకుండా, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పిద్దాం. పేద ప్రజలకు అండగా నిలబడటం, రైతుల సమస్యల కోసం పోరాడటం, ప్రజాసేవను మన బాధ్యతగా భావించడం ద్వారా నిజమైన నివాళి అర్పిద్దాం నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య ప్రధాన కార్యదర్శి కుంభం సప్నరెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షులు వంశ వర్ధన్ రావ్, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏలుబాక సుజాత ఏఎంసి డైరెక్టర్ పిల్ల మరి రమేష్, మంథని నియోజకవర్గం యూత్ అధ్యక్షులు చీమల సందీప్,కాటారం మహిళా అధ్యక్షులు జాడి మహేశ్వరి, యూత్ కాంగ్రెస్ కాటారం మండల అధ్యక్షులు ధన్వాడ చిటూరి మహేష్ గౌడ్,పాగే సురేష్, దబ్బెట రాజేష్ ,ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్ రెడ్డి, పాలారపు వెంకట్ స్వామి,అజ్మీర రఘురాం నాయక్, నంది శంకరయ్య, కారెంగాల తిరుపతి గౌడ్, కామిడి వెంకటరెడ్డి,కొట్టే ప్రభాకర్, అయిలీనేని నవీన్ రావ్, తెప్పల ప్రభాకర్, మొగిలి రాజ్ కుమార్ యాదవ్, గడవేనా దేవేందర్ యాదవ్,కడారి విక్రం,ఆత్మకూరి కుమార్ యాదవ్,గోనే మహేష్, సుందిళ్ల ప్రభు, సింగిరెడ్డి ప్రవీణ్ వీరితోపాటు సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ రహీం మరియు సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలాల పండుగను ఘనంగా నిర్వహించుకుందాం

### ఆదివాసీ సంఘాల పిలుపు



**జై నూర్, సెప్టెంబర్ 2(జనం సాక్షి)**తమ జీవన విధానంలో, వ్యవసాయ పనుల్లో తోడుగా నిలిచే మూగజీవాల రుణం తీర్చుకునేందుకు పోలాల పండుగను గూడేలు, గ్రామాల్లో సాంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.జైనూర్ మార్కెట్ యార్డ్ వద్ద ఆదివాసీ సంఘాల ప్రతినిధులు సమావేశమై పండుగ ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తరతరాలుగా వస్తున్న ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉండే ఎడ్లను, గోవులను పూజించి వాటికి కృతజ్ఞతలు తెలుపుకోవడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశమని గుర్తుచేశారు. జరుపుకోవాలని పండుగ రోజున ఎడ్లకు విశ్రాంతినిచ్చి, వాటిని శుభ్రం చేసి రంగులు, పూలమాలలతో ముస్తాబు చేయాలని, గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ఉత్సవాన్ని ఐక్యంగా జరుపుకోవాలని కోరారు. ఆధునిక మార్పుల నడుమ పురాతన పండుగల ప్రాముఖ్యత మరుగున పడకుండా రాబోయే తరాలకు మన సాంప్రదాయాలను చాటిచెప్పాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రతి గూడెం, పల్లెల్లో రైతులు, యువత,10, గురువారం,తేదీనాడు కన్సెక్ని, 11, శుక్రవారం పొలాల అమావాస్య, 12 శనివారం,నాడు బెడ్గా ఈ మూడు రోజులు పండుగనుజరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, బాజీరావుగేడం గణపత్ రావు సార్మేడి, మర్లవాయిలఆత్రం ఆనంద్ రావు సార్మేడి,మహాగావ్మెస్రం భాదిరావు సార్మేడి, లేండిజలాఆత్రం మక్తుర్ష సార్మేడి ,పంగిడిసెడ్మాకి భగవంత్ రావు ,జిల్లా అధ్యక్షులు,కుంర శ్యాంరావు ,మాజీ సర్పంచ్కుంర చందు ,మండల అధ్యక్షులు, తుడుందెబ్బ తదితరులు పాల్గొన్నారు

## 1,000 రోజుల పాలనలో కాంగ్రెస్ చేసిందేమిటి



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 02,(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి రామ్కిషన్రెడ్డి విమర్శించారు. బుధవారం నిర్మల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, అయ్యన్నగారి రాజేందర్, గంధ్రత్ రమేష్, శ్రీకాంత్ యాదవ్ , సుభాష్ రావు, నయీం, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వైఎస్ఆర్ 17వ వర్ధంతి



**స్టేషన్ ఘన్పూర్,సెప్టెంబర్ 02(జనం సాక్షి ) :**ఈరోజు స్టేషన్గన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ని మహానేత వైఎస్ఆర్ 17వ వర్ధంతి నిర్వ హించడం జరిగింది. స్టేషన్గన్పూర్ మున్సిపా లిటీ వైయస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి వేడుకలు సందర్భంగా అభ్యుదయ యువజన సంఘం నియోజక వర్గ కన్వీనర్ పోశాల కృష్ణ, మేకల మల్లేష్, నోముల జైపాల్ రెడ్డి, షేక్ జానీ బాబా, పలు వురు వైయస్ అభిమానులు వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.అనంతరం పండ్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా అభ్యుదయ యువ జన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైయస్సార్ సేవలు ప్రతి పేదవాడికి అన్ని విధాల నిరుపేదలకు,108 సేవలు, ఫీజు రీయింబర్స్మెంట్, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, సేవలు,రెండు రూపాయల కిలో బియ్యం, రైతుల ఉచిత విద్యుత్, వృద్ధులకు పెన్షన్స్,ఇలాంటి ఎన్నో నిరుపేదలకు ముఖ్య మంత్రులు మారిన మరపురాని మహానేతగా తెలుగు రాష్ట్రాలలో చెరగని ముద్ర వేసుకున్న వైయస్సార్ కు దక్కుతుందని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన పై నిరసన కార్యక్రమాలు విడ్డురం

### రాష్ట్ర ఈ జి సి కౌన్సిల్ సభ్యులు దండు రమేష్



**మల్హర్, సెప్టెంబర్ 02(జనంసాక్షి)**కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాపాలన 1000 రోజుల పాలన మీద నిరసన కార్యక్రమాలు చేయడం విడ్డురంగా ఉంది అని ఈ జి సి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్ అన్నారు. వారు మాట్లాడుతు దొంగే..దొంగా దొంగా అని అరిచినట్టుగా ఉంది ఈ టిఆర్ఎస్ నుండి బీఆర్ఎస్ గా పేరు మార్చుకున్న పార్టీ నాయకుల వ్యవహారశైలిని చూసి రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి ఒక దళితుడె ఉంటాడు అని అన్నా కేసీఆర్ ఆ మాట నెరవేర్చిండా అని అన్నారు.నేను రాష్ట్రానికి కాపలాగా ఉంటాను అన్న కేసీఆర్ మొదటి ముఖ్యమంత్రి గా ఏ దళితుడిని చేశారో చెప్పాలి.పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇచ్చారా చెప్పాలి అని డిమాండ్ చేశారు.

# బస్టాండ్ లో సమస్యలు పరిష్కరించాలి

### సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



**పాలకుర్తి, సెప్టెంబరు 02(జనంసాక్షి)** నియోజకవర్గ కేంద్రంలోని పాలకుర్తి బస్టాండ్ లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం బస్టాండ్ ను సీపీఎం నాయకులు సందర్శించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య మాట్లాడు తూ బస్టాండ్ ఆవరనలో గుంతలు పడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బస్టాండకు వచ్చే ప్రయాణికులకు కనీస త్రాగునీటి సౌకర్యం కల్పించలేని పాలకులు ఉన్నారని ఆరోపించారు. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలచిఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, ఇంద్రారెడ్డి, పద్మ, లక్ష్మీ, వెన్నెల, చంద్రమ్మ, మైసమ్మ, యాకలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల రూపురేఖలు మార్చేలా వీజీపీపీ

## గ్రామాభివృద్ధికి 'వికసిత పంచాయతీ' ప్రణాళిక ఎంపీడీవో అరుణారాణి



**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** మండలంలోని సముందర్‌పల్లి గ్రామపంచాయతీ భవనంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఉపసర్పంచ్ ప్రశాంత్, ఎంపీడీవో అరుణా రాణి పాల్గొని "వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ)" పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికను రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుణా రాణి తెలిపారు. గ్రామంలోని తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం తదితర రంగాల్లో ఉన్న అవసరాలను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అవసరాలు, సమస్యలను గుర్తించి ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల పథకాలను సమన్వయం చేసుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను గ్రామసభ దృష్టికి తీసుకురావాలని, వాటిని ప్రణాళికలో చేర్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీ.ఏ. రమణ, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల ప్రతినిధి , సెప్టెంబర్ 2,జనంసాక్షి .** జిల్లాలో కొనసాగుతున్న రీ- సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలం ఆయెపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను మండల తహసీల్దార్ రాఘవేంద్ర తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రీ-సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కోటపల్లి మండలం అల్గావ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ లో భాగంగా చేపట్టిన విచారణను పరిశీలించి ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్ ను తహసీల్దార్ సదానందం తో కలిసి సందర్శించి, పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ బియ్యం వివరాలను అడిగి తెలుసుకొని, సిఎంఆర్‌కు సంబంధించిన పెండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని ప్రతిపాదిత నూతన మండల రెవెన్యూ కార్యాలయం నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. రీ-సర్వే పనులను సమీక్షించి, సర్వేకు సంబంధించిన వివరాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, అన్ని సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**రెబ్బెన,సెప్టెంబర్02 (జనం సాక్షి):** ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల హాజరును పరిశీలించడంతో పాటు తరగతి గదులను, విద్యాబోధన తీరును, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా చూడాలని, వందశాతం హాజరు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంప్యూటర్ పరిజ్ఞానంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అనంతరం రెబ్బెన పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ హరిత సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. చిన్నచిన్న కారణాలతో రోగులను ఇతర ప్రాంతాలకు పంపించవద్దని స్పష్టం చేశారు. నెలలు నిండిన గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సుఖప్రసవానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

# కెరమెరి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కె.రాజు



**కెరమెరి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి)** కెరమెరి పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా సిసిఎస్ ఆసిఫాబాద్లో విధులు నిర్వహిస్తున్న కె. రాజు బదిలీపై వచ్చి బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకే తన ప్రధాన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, అక్రమ ఇసుక రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెస్తా

## 24 గంటలు అన్ని రకాల వైద్య సేవలకు చర్యలు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ సెప్టెంబర్ 02 (జనం సాక్షి)** ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులను తీసుకువచ్చి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించారు. గత సమావేశాలలో గుర్తించిన సమస్యలను ఈ సందర్భంగా వైద్యులు గుర్తు చేశారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే రోగులకు 24 గంటలు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డి, వైద్యులు డాక్టర్ వంశీ మాధవ్, తాహసిల్దార్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# పత్తిలో చీడపీడలపై రైతులకు అవగాహన

## మాడేగాం, కదిలి గ్రామాల్లో శాస్త్రవేత్తల క్షేత్ర పర్యటన



**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** మాడేగాం, కదిలి గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. రైతులతో మాట్లాడి పత్తి పంటలను పరిశీలించి చీడపీడల నివారణపై సూచనలు చేశారు. కీటక శాస్త్రవేత్త కె. రాహుల్ విశ్వకర్మ పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులు, తెల్లదోమ నియంత్రణపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఆకుల దినేష్ మెరుగైన దిగుబడుల కోసం విత్తన రకాలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. పంట చుట్టూ జొన్న లేదా సజ్జను రక్షణ పంటగా సాగు చేయాలని సూచించారు. పసుపు, నీలం జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పురుగుల ఉధృతి ప్రారంభంలో వేపనూనె వినియోగించాలని, మిత్రపురుగులను కాపాడాలని సూచించారు. సస్యరక్షణ మందులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని, ఒకే మందును పదేపదే వాడొద్దని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ మారుతి పటేల్, రైతులు లింగన్న, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌ను సన్మానించిన ఇమ్మానియేల్ రాజు



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా ఇటీవల నూతనంగా నియమి తులైన తాటి కొండ గ్రామానికి చెందిన నలిమెల ఏలియాను డివిజన్ కేంద్రంలోని స్టేషన్ ఘన్పూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చా ర్జ్ సింగపురం ఇందిరా కుమారుడు ఇమ్మాని యేల్ రాజు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లఆధ్వర్యంలో బుధవారం నలిమెల ఏలియా ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగాఇమ్మానియేల్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మీ యొక్క సేవలు పార్టీ బలోపేతం కోసం మీ పార్టీ పదవి ద్వారా మరోసారి ప్రభు త్వం అధికారంలోకి రావడం కోసం కృషి చేయాలని అన్నారు.ఈకార్యక్రమంలో జనగా మ జిల్లాకార్యదర్శి తాటికొండ సంపత్ కుమా ర్ యాదవ్, ఏఎంసీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరపక వసంత్, నంది శ్రీనివాస్, మహేందర్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# అగ్రంపాడు గ్రామ రీసర్వే



**ఆత్మకూరు, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** అగ్రం పహాడ్ గ్రామ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు రెవెన్యూ డివిజనల్ అధికారి డి ఎస్ వెంకన్న ఆత్మకూర్ తహశీల్దార్ ఎన్. జగన్ మోహన్ రెడ్డి తో కలిసి గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి గ్రామ సరిహద్దు యొక్క సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సర్వే యొక్క ముఖ్య ఉద్దేశాలను తెలియజెప్పి గ్రామస్తులంతా ఈ సర్వేలో పాల్గొని వివాదాలు లేకుండా గ్రామ సరిహద్దు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామ సరిహద్దు ఏర్పాటు చేసుకున్న తర్వాత మొదట ప్రభుత్వ భూములు, తర్వాత పట్టాభూముల సర్వే జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గ్రామ పాలన అధికారి వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు రాజకీయ నాయకులు గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి పితృవియోగం

## పలు పార్టీలకు చెందిన నాయకులు కుల సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు



**చిట్యాల ,సెప్టెంబర్ 02 (జనం సాక్షి):**మండలం కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన చిట్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కట్కూరి మొగిలి తండ్రి కట్కూరి నరసయ్య మంగళవారం రాత్రి అకాల మరణం చెందారు. నరసయ్య మృతదేహాన్ని పలు పార్టీలకు చెందిన నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు సందర్శించి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి కుమార్, మొగిలి, ఐలయ్య, నరసింహారాములు, మహేందర్ అనే ఐదుగురు కుమారులు ఉన్నారు.ఈ సందర్భంగా చిట్యాల సర్పంచ్ తవటం లక్ష్మితో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు దబ్బేట అనిల్, గూట్ల తిరుపతి, అల్లం రవీందర్, తవటం నవీన్, గొర్రె సాగర్, కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు బుర్ర వెంకటేష్‌గౌడ్, ఏవైఎస్ నాయకులు పుల్ల మల్లయ్య, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు నరసయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

# 70వ మండల ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు ప్రారంభం

## కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో విద్యార్థుల ప్రతిభకు వేదిక




**దేవరుప్పుల, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** దేవరుప్పుల మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్‌లో 70వ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. అండర్--14 నుంచి అండర్--17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఎస్‌జీఎఫ్ఐ మండల కార్యదర్శి, పీడీ పాండ్య, పాఠశాల కరెస్పాండెంట్ రమేష్‌బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోటకూరి స్వప్నతో పాటు మండలంలోని వివిధ పాఠశాలల పీడీలు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ అంబేద్కర్ పై అణుచిత వాక్యాలు చేసిన హామరా ప్రసాద్ పై చట్టపర మైన చర్యలు తీసుకోవాలి

**ఎల్క తుర్తి జనంసాక్షి. సెప్టెంబర్ 2** మండల కేంద్రములో డా బి ఆర్ అంబేద్కర్ వారసులు సంఘశీ జిల్లా నాయకులు సాతూరి . రాజమౌళి అంబేద్కర్ వాదులు గొర్రె థామస్ విలేకర్ల సమావేశములో మాట్లాడారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత పై హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని వారు మతిస్థిమితం లేక మాట్లాడారని అన్నారు ప్రసాద్ ఒక విగీత జీవి కళ్ళు మూసుకొని జీవిస్తున్నాడని అన్నాడు ప్రపంచ దేశాలు అంబేద్కర్ ఆశయసాధన కోసం పాటుపడితే బిత్తిరీ ప్రసాద మాట్లాడడం చట్టవిరుద్ధమని ఈ సందర్భంగా అన్నారు.. ప్రజలరప్రజాస్వామికావాదు లారా. విద్యార్థి. విద్యార్థుల్లారా. మేధావుల్లారా మనభారతదేశ ప్రజాస్వామ్య లౌకికదేశం. విభిన్న. మతాలు. విభిన్న సంస్కృతులు. విభిన్న జాతులు కలదేశం భారత రత్న. బి ఆర్ అంబేద్కర్ ను. గౌరవిస్తూ పూజిస్తున్న దేశాలు అయితే హమారా. ప్రసాద్ అనేవ్యక్తి. కుట్రచేస్తు న్నట్లు తెలుస్తుంది. .అందులోభాగమే. అంబేద్కర్ పై అనుచిత. వ్యాఖ్యలను మనం. ఖండించాలి. హమారా. ప్రసాదపై. దేశాద్రోహ కేసుపెట్టాలని. ప్రభుత్వాన్ని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంప్రదాయబద్ధంగా ముగిసిన తీజ్ ఉత్సవాలు

- సంప్రదాయాల సోయగం.. తీజ్ లో గిరిజన సంస్కృతి వైభవం
- సందడిగా పాల్గొన్న అధికారులు,యువతులు, మహిళలు,విద్యార్థులు
- ముఖ్య అతిథిగా డీసీసీ జిల్లా అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్



**గూడూరు,సెప్టెంబర్02(జనంసాక్షి):** బంజారా(లంబాడ)సమాజంలో అత్యంత విశిష్టమైన సాంప్రదాయ పండుగలో తీజ్ పండగ ఒకటని,యువతులు,మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పంటలు సమృద్ధిగా పండాలని,కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని తీజ్ పండుగ ముఖ్య ఉద్దేశమని మానుకోట డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళీ నాయక్ అన్నారు.బుధవారం గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన 9రోజుల తీజ్ వేడుకలలో భాగంగా చివరి రోజు బోగి బండరో కార్యక్రమాన్ని కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.తీజ్ పండుగలో భాగంగా యువతులు,మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు చేసి చివరి రోజు దానిని సంప్రదాయాల ప్రకారం తీజ్ బుట్టలల్లో పెరిగిన నారును మహిళలు,విద్యార్థులు బుట్టలను చెత్తో పట్టుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ పాటలు,నృత్యాలతో సందడి చేస్తూ, బోగి బండరో కార్యక్రమంలో మహిళలు,యువతులు సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానుకోట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ హాజరైనారు.ఈసందర్భంగా ఉమా మురళీ నాయక్ మాట్లాడుతూ తీజ్ వేడుకలు తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. గిరిజనుల జీవన విధానంలో సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం ఉందని ఆధునికత పరుగులు తీస్తున్న తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కాపాడుకుంటూ భావితరాలకు అందిస్తున్న గిరిజన సమాజం మరోసారి తమ సంస్కృతి గొప్పతనాన్ని చాటుకుందని తీజ్ వేడుకల్లో భాగంగా చివరి రోజు నిర్వహించిన భోగి బండారో కార్యక్రమం ఇందుకు నిదర్శనంగా నిలిచింది అన్నారు. తేజ్ వేడుకలు కేవలం ఒక పండుగగా కాకుండా గిరిజన మహిళలు యువతులు ఐక్యతకు సంప్రదాయాల పరిరక్షణకు ప్రతికగా నిలుస్తున్నాయని పూజలు పాటలు నృత్యాలు సాంప్రదాయ వస్త్రాదారులతో నిర్వహించే కార్యక్రమాలు గిరిజన సంస్కృతిలోని ప్రత్యేకతను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.

**పాటల్లో పూర్వీకుల జ్ఞాపకాలు.. అడుగుల్లో సంస్కృతి...**

భోగి బండారో కార్యక్రమంలో యువతులు మహిళలు సంప్రదాయ బద్ధంగా పాల్గొని పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు.ప్రతి పాటలోను తమ జీవన విధానం,ప్రకృతితో అనుబంధం,పూర్వీకుల ఆచారాల ప్రతిధ్వని కనిపించిందని యువతరం సైతం ఉత్సాహంగా పాల్గొనడం గిరిజన సంస్కృతికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రదాయాలు కనుమరుగ వుతున్న తరుణంలో తీజ్ వంటి వేడుకలను ఘనంగా నిర్వహించడం ద్వారా గిరిజనులు తమ సంస్కృతి ని సజీవంగా కాపాడుతున్నారని, పండగల పేరుతో కేవలం వేడుకలు నిర్వహించడం కాకుండా,ఆచారాలను, విలువలను,పిల్లలకు తెలియజేయడం,గిరిజన సంస్కృతి ఒక వారసత్వమని,దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈకార్యక్రమంలో గూడూరు మెజార్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్,గూడూరు సీఐ వినయ్ కుమార్, ఎస్ఐ రమేష్ బాబు,సీఐ బానోత్ కాశీరం నాయక్,మండల అధ్యక్షులు దారవాత్ బాలాజీ నాయక్,తీజ్ కమిటీ అధ్యక్షులు ధర్మనాయక్,పూజారి వాల్యనంద నాయక్,బానోత్ లక్ష్మన్ నాయక్,అజ్మీరా సురేష్ నాయక్,వాంకు డోత్ భరత్ నాయక్,వాంకుడోత్ గోపినాథ్,పింగిలి శ్రీనివాస్,సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు, మహిళలు,యువతులు,గ్రామస్తులు,కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాలికల పోషణ, ఆరోగ్యం--భద్రతకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలకం

## అంకుషాపూర్, సుబ్బక్కపల్లిలో పోషణపై అవగాహన కార్యక్రమాలు



**టేకుమట్ల సెప్టెంబర్ 02 జనంసాక్షి** టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్, సుబ్బక్కపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ ఆదేశాలతో, జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి మల్లేశ్వరి సూచనల మేరకు డీహెచ్ఈడబ్ల్యూ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలు చిన్నారుల పోషణ, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సాధికారత కోఆర్డినేటర్ క్రిష్ణ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు చిన్ననాటి నుంచే పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికల ఆరోగ్యం, విద్య, భద్రతతో పాటు బాల్యవివాహాల నివారణపై గ్రామస్థాయిలో నిరంతర అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జెండర్ స్పెషలిస్ట్ అనూష మాట్లాడుతూ, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్థాయిలో మహిళలు, బాలికలు చిన్నారులతో నేరుగా అనుసంధానమై పనిచేస్తున్నందున వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పోషకాహారం అందించే కేంద్రంగానే కాకుండా బాలికల ఆరోగ్యం, హక్కులు, విద్య, భద్రత సాధికారతకు మార్గదర్శక కేంద్రంగా పనిచేయాలని అన్నారు. జెండర్ స్పెషలిస్ట్ మమత మాట్లాడుతూ బాలికలపై వివక్షను నిర్మూలించి, వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు కుటుంబాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామ ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సుబ్బక్కపల్లి సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ, గ్రామంలో బాలికల ఆరోగ్యం, విద్య భద్రతకు గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. బాలికల భవిష్యత్తు కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు గ్రామస్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ కుమార్తెలను చదివించి, వారి లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సహించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు భాగ్య లక్ష్మి, స్వప్న మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మరియు బాలికలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ సేవలను ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు.తదుపరి లబ్ధిదారులకు టి హెచ్ ఆర్ డిస్ట్రిబ్యూషన్ పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ అనూష,మమత, సుబ్బక్కపల్లి సర్పంచ్ రాజేందర్, అంకుషాపూర్ ఉపసర్పంచ్ మౌనిక,అంగన్‌వాడీ టీచర్లు, భాగ్య లక్ష్మి ,స్వప్న, గ్రామ ప్రజలు, గర్భిణీలు, బాలింతలు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో హామీల అమలు ఎక్కడ?

## వెయ్యి రోజుల్లో వెయ్యి మోసాలు.. ప్రజాధనంతో సంబరాలెందుకు?: బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రామనాథ్



**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సంబరాలు నిర్వహించడాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రామనాథ్ తప్పుబట్టారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజాధనంతో సంబరాలు నిర్వహించడం సరికాదని విమర్శించారు. బుధవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసిందని, అయితే వాటిలో చాలా వరకు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, అర్హులైన ప్రతి కుటుంబానికి పింఛన్, వివాహ సమయంలో తులం బంగారం, నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి, రైతుబంధు, ఉద్యోగాల కల్పన వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఏమి చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి**

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా కేంద్రం నుంచి వచ్చే నిధులతోనే కాలయాపన చేస్తోందని రావుల రామనాథ్ ఆరోపించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీటి వసతులు, ఆలయాలు, పాఠశాలలు, స్మశానవాటికలు తదితర అభివృద్ధి పనులకు కేంద్ర నిధులే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. కేంద్రం అందిస్తున్న నిధులతో జరుగుతున్న పనులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని విమర్శించారు.

**దాడులు, కేసులకు భయపడేది లేదు**

ప్రజా సమస్యలపై బీజేపీ ప్రశ్నిస్తే పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్లపై దాడులు చేయడం, పోలీసు కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా ప్రజల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని తెలిపారు. తెలంగాణలో బీజేపీ బలోపేతం కావడం ఖాయమని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర--రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు దొడ్డికింది ముత్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, జిల్లా కార్యదర్శి వీరేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు శైలేశ్వర్, తక్కల సాయిరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రాజలింగం, తోట శ్రీకాంత్, రమేష్, దీక్షిత్‌రెడ్డి, సుబ్బన్న, ముత్యం, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేలో రైతులంతా పంట వివరాలు నమోదు చేసుకోవాలి

## వ్యవసాయ అధికారి రాజేందర్

**జైనూర్, సెప్టెంబర్ 2(జనం సాక్షి):** ప్రభుత్వం పంటల కొనుగోళ్లకు డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదైన వివరాలనే ప్రామాణికంగా పరిగణించనున్నందున రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా సక్రమంగా నమోదు చేయించుకోవాలని జంగావ్ అగ్రికల్చర్ క్లస్టర్ ఏఈఓ రాజేందర్ నేత సూచించారు. బుధవారం జైనూర్ మండలంలోని జంగావ్ అగ్రికల్చర్ క్లస్టర్‌లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ రాజేందర్ నేత మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను సరిగ్గా తెలియజేసి నమోదు చేయించుకోవాలని సూచించారు.ప్రతి గ్రామంలో అగ్రికల్చర్ వాలంటీలు సర్వేకోసం వస్తారు వారు మీయొక్క పంట చేనులకు వచ్చినప్పుడు వారితో ఉండి కంపల్సరిగా పంట నమోదు చేసుకోవాలి.పంట నమోదు విషయంలో ఏమైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.



**అలసత్వం వహిస్తే రైతులకు నష్టం :**

డిజిటల్ క్రాప్ సర్వేలో పంట వివరాల నమోదుపై రైతులు అలసత్వం వహిస్తే భవిష్యత్తులో నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం, సీసీఐ ద్వారా పత్తి సేకరణ చేపట్టడం వంటి సందర్భాల్లో సర్వేలో నమోదైన పంట వివరాలనే ఆధారంగా తీసుకునే అవకాశం ఉన్నందున రైతులు సర్వే కు సహకరించాలని సూచించారు. తమ పొలాల్లో సాగు చేస్తున్న పత్తి, మొక్కజొన్న, కందులు, వరి తదితర పంటల వివరాలు యాప్‌లో సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవాలని ఏఈఓ రాజేందర్ నేత కోరారు.

# సేవకులకు దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ
- కాశిబుగ్గలో మిషనరీ ఆఫ్ చారిటీ సందర్శన

**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 02 ( జనం సాక్షి)** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి పూజ వరంగల్ కాశీబుగ్గలోని మిషనరీస్ ఆఫ్ చారిటీని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న మానసిక దివ్యాంగులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారికి పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, సమాజంలో ఆదరణ అవసరమైన మానసిక దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. మిషనరీస్ ఆఫ్ చారిటీ ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలను అభినందించారు.మిషనరీస్ ఆఫ్ చారిటీ ద్వారా మానసిక వైకల్యంతో ఉన్న వ్యక్తులకు ఓర్పు, సహనం, ప్రేమతో నిస్వార్థ సేవలందిస్తున్న సిస్టర్స్‌ను న్యాయమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. వారి అంకితభావం, సేవా స్ఫూర్తి ప్రశంసనీయమని అన్నారు. పట్ల ఎంతో ఓర్పు, సహనం మరియు ప్రేమతో సేవలందిస్తున్న సిస్టర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వారి



నిస్వార్థ సేవా భావం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు.అక్కడి దివ్యాంగులతో కొంత సమయం గడపడం సంతోషంగా ఉందని, వారి అవసరాలను తెలుసుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉందని తెలిపారు. "మానసిక దివ్యాంగుల జీవితాల్లో ఆరోగ్యం, ప్రశాంతత ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. సిస్టర్స్ చేస్తున్న సేవలకు దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాస రావు, మిషనరీస్ ఆఫ్ చారిటీ సిస్టర్ ఎల్వీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోడిఫైడ్ సైలెన్సర్ బైక్‌లపై పోలీసుల కొరడా

## 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 02(జనంసాక్షి):** సైలెన్సర్లను మోడిఫై చేసి అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ద్విచక్ర వాహనాలపై మందమర్రి పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా శబ్దాలు చేస్తూ ప్రయాణిస్తున్న ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి, వాహనదారులు, యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మోడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దాలు చేస్తూ వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ తెలిపారు. అధిక శబ్దాల వల్ల వృద్ధులు, చిన్నారులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## బేడ బుడగ జంగం అధ్యక్షులు

# శంకర్ ఆధ్వర్యంలో ఎస్సైకి సన్మానం




**మహాదేవపూర్: సెప్టెంబర్ 2 (జనంసాక్షి ) :** బేడ బుడగ జంగం మహాదేవపూర్ మండల అధ్యక్షులు చెర్ల శంకర్ ఆధ్వర్యంలో సంఘనాయకులతో కలిసి సాంబమూర్తిని సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం జయశంకర్ జిల్లా భూపాలపల్లి మహాదేవపూర్ ఎస్సై ఎం సాంబమూర్తి ని మర్యాదపూర్వకంగా కలిసి. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగం కుల పెద్ద మనుషులు కల్లెం రాజు రేవెల్లి రాజయ్య, రేవెల్లి రాములు ,బొమ్మల సాయిలు పురాణం లింగయ్య, కల్లెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షున్ని

# సన్మానించిన మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి

## మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు



**టేకుమట్ల సెప్టెంబర్ 02 జనంసాక్షి** టేకుమట్ల మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా ఎన్నికైన మచ్చ శ్రీకాంత్ కు శాలువాతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేసిన మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన ప్రజాక్షేత్రంలో నిలబడి వారి తరఫున నిరంతరం పోరాటాలు చేయాలని అదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను కలుపుకొని ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండి పోరాటం కొనసాగించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో టేకుమట్ల గ్రామ సర్పంచ్ మాట్ల శ్రీనివాస్ మండల సీనియర్ నాయకులు బొడ్డు సదానందం బి ఆర్ ఎస్ టౌన్ అధ్యక్షులు నిమ్మల స్వామి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మారేపల్లి కొమురయ్య హమాలీ యూనియన్ ప్రెసిడెంట్ మచ్చ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



**నడిగూడ సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నడికూడ మండల అధ్యక్షులు రామంచ నరేష్,మండల ఎం ఎస్ పి అధ్యక్షులు మేకల రవి మరియు అధికార ప్రతినిధి బొల్లారం అనిల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది.గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడుగా బొల్లారం నాగరాజు,ఉపాధ్యక్షులుగా గంగారం నరేష్, ప్రధాన కార్యదర్శిగా శనిగరం సాయి కోశాధికారిగా బొల్లారం రమేష్ , అధికార ప్రతినిధిగా సిద్దెంకి రాజు,ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎంఎస్పి గ్రామ కమిటీ అధ్యక్షులుగా మహిపాల్ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు

## దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు



**పరకాల,సెప్టెంబర్02,(జనం సాక్షి):** పరకాల పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివాంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన చేసిన 108, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, రైతు రుణమాఫీ అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ఆర్ అని, సేవలను కొనియాడుతూ ఆయన గురించి స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటెరు రామ్మూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్ తాజా మాజీ కౌన్సిలర్స్ పోరండ్ల సంతోష్, గూడెల్లి సదన్ కుమార్, కొయ్యడ శ్రీనివాస్, బండి శ్రీధర్, పసుల లావణ్య రమేష్, బొచ్చు సాల్మన్, సుధమల్ల రమేష్ ,జిల్లా కార్యదర్శి జాఫర్ రిజ్వి, కాంగ్రెస్ నాయకులు ఎండి రంజాన్ అలీ, బుర్ర రాజమౌళి, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి,చంద్రమౌళి , కొక్కిరాల తిరుపతిరావు, బొచ్చు భాస్కర్, ఐలిపెల్లి స్వామి,మడికొండ సంపత్ గొట్టే రమేష్, బొచ్చు జితేందర్, గోవిందు కుమారస్వామి,, లక్కం రమేష్, మహిళా నాయకురాళ్లు లక్కం వసంత, దాసరి ఉమా తదితరులు నివాళులర్పించడం జరిగింది.

## రైతుల ప్రయోజనాలపై డీసీవోతో చర్చించిన పిఎసిఎస్ చైర్మన్



**బయ్యారం సెప్టెంబర్ 2 ( జనం సాక్షి)** మహబూబాబాద్ జిల్లా సహకార అధికారి డి సి ఓని బయ్యారం సింగిల్ విండో చైర్మన్ బండారి మల్లయ్య మరియు డైరెక్టర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఎ సి ఎస్ అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించడం, సొసైటీ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై డీసీవో గారితో చర్చించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా సహకార సంఘం సేవలను మరింత బలోపేతం చేయాలని చైర్మన్ తెలిపారు. అలాగే డీసీవో కూడా బయ్యారం సింగిల్ విండో అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బయ్యారం డైరెక్టర్లు కసనబోయిన శ్రీనివాస్, నుద్దునూరి యశోద, ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా రంజిత్, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలేబోయిన వెంకటేశ్వర్లు, దూదిమెట్ల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుకి శాలువా కప్పిన మహిళా మోర్చా నాయకురాళ్లు



**వరంగల్ మండలం, సెప్టెంబర్ 02 (జనం సాక్షి)** తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలలో పాల్గొనడానికి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు హనుమకొండ జిల్లాకు వచ్చిన సందర్భంగా. కాజీపేట బాపూజీ నగర్ బ్రిడ్జి వద్ద బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో వారికి ఘనంగా స్వాగతం పలికి అక్కడి నుండి ర్యాలీగా పరకాలకు బయలుదేరుతుండగా ములుగు క్రాస్ రోడ్ వద్ద వరంగల్ జిల్లా మహిళా మోర్చా నాయకురాళ్లు ,రాష్ట్ర అధ్యక్షులు రామ్చందర్ రావు స్వాగతం పలికి శాలువా కప్పారు. ఈ కార్యక్రమంలో ,మహిళా మోర్చా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక , ప్రధాన కార్యదర్శి రేపల్లె స్వర్ణజ , ఉపాధ్యక్షురాలు శోభారాణి , కోశాధికారి స్వరూప , ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలన హామీల అమలు ఏది?

- కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన
- చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో 420 అడుగుల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ బస్టాండ్ వద్ద ధర్నా



**పరకాల,సెప్టెంబర్02,(జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాలలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 420 అడుగుల ఫ్లెక్సీ తో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మొదటగా అంబేద్కర్ సెంటర్లోని వారి విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించి బస్టాండ్ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రెండు లక్షల ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని దేవుళ్లపైనా ఓట్లువేసి,బాండ్ పేపర్లపై సంతకాలు చేసి హామీ ఇచ్చినప్పటికీ.. 1000 రోజులు గడిచినా ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలకు ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గుర్తుచేశారు. ఇక కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని,కర్రుకాల్చి వాతలు పెట్టడానికి ప్రజలున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధిక సాంద్రత ప్రత్తి సాగుతో రైతులకు లాభసాటి

### బెల్లంపల్లి ఏడిఏ రాజ నరేందర్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2, (జనంసాక్షి)** అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులకు లాభసాటి అని బెల్లంపల్లి ఏడిఏ రాజ నరేందర్ అన్నారు. బుధవారం ఆయన గురజాల రైతు వేదికలో మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రత గల ప్రత్తి పంట సాగు విధానాన్ని వాటి ప్రాముఖ్యతను తెలుసుకొని సాగు చేయాలని అన్నారు. పంట కాలాన్ని మనకు అనుకూలంగా చేసుకొని ఒకేసారి పికింగ్ వచ్చేలాగా నూతన యాజమాన్య పద్ధతులు ద్వారా నేర్చుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రికరణ, కూలీల ఖర్చు నివారణ, అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పత్తి సాగులో అధిక సాంద్రత నూతన విధానాన్ని ఎంచుకోవాలని రైతులకు సూచించారు. గులాబీ రంగు పురుగు నివారణకై రైతులు రెండవ పికింగ్ అయిన వెంటనే పత్తి కోయలను తీసివేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ ఫర్ సేల్(ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను రైతు ఇంటి వద్దనే ఉండి బుక్ చేసుకోవాలని, అది ఏవిధంగా బుక్ చేసుకోవాలనేది రైతులకు వివరించారు. రైతుల సంక్షేమం కొరకు వ్యవసాయ యాంత్రికరణ పథకాన్ని తీసుకురావాలని ప్రభుత్వం దృష్టి పెట్టిందని మరియు ఈ విధానాన్ని ఎక్కువ మంది రైతులు పాటించినట్లయితే అందరికీ లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్ తిరుపతి, గురుజాల వ్యవసాయ విస్తరణ అధికారి గౌసియ బేగం, రైతులు పాల్గొన్నారు.

# పేదల మనిషి వైస్సార్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2, (జనంసాక్షి)** వైస్సార్ పేదల మనిషి అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను కళ్లారా చూసి వారి కోసం సంక్షేమ పథకాలను తెచ్చిన గొప్ప నాయకుడు అని అన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకోవచ్చారని, ఆయన హయాంలోనే ఆరోగ్య శ్రీ, 108 సేవలు, ఇందిరమ్మ ఇల్లు వంటి గొప్ప సంక్షేమ పథకాలను అందించిన మహా నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని కొనియాడినారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, టీపీసీసీ మెంబర్ చిలుముల శంకర్, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎర్ర ఆదర్ష్, డీసీసీ సెక్రటరీ జమ్మికుంట విజయ్, బెల్లంపల్లి పట్టణ అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్, పట్టణ ప్రధాన కార్యదర్శి డెబ్బేటి రమేష్, గుజ్జ రవి, ఉపాధ్యక్షులు దుబాసి వెంకట స్వామి, అబ్దుల్ ఖలీల్, వాజీద్, కార్యదర్శులు ఎల్తూరి శంకర్, పరమేశ్వర్, సాయి కిరణ్, మాజీ వైస్ చైర్మన్ గెల్లి రాజలింగు, పోలు శ్రీనివాస్, నాయకులు కుంభాల రాజేష్, ఎలుక ఆకాష్, కాసర్ల యాదగిరి, సబ్బనీ రాజనర్సు, గద్దల కుమార్, కాంపెల్లి సతీష్, అలీ భాయ్, పట్టి నవీన్, పాముల రాజలింగు, నంది కొమురయ్య, బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సి , మైనారిటీ సెల్, మహిళ నాయకులు, ఎన్ఎస్యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, 34 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**నర్సంపేట సెప్టెంబర్ 2 (జనం సాక్షి)** నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా కూచన రవీందర్,ప్రధాన కార్యదర్శిగా పెండెం భాస్కర్. కోశాధికారిగా గాజుల రాము. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి . ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ప్రమాణ స్వీకారం అనంతరం జాతీయ అధ్యక్షులు కందకట్ల స్వామి. మాట్లాడుతూ నర్సంపేట పద్మశాలీల ఐక్యత వలన సంఘం అభివృద్ధి జరిగిందని, రాజకీయాల్లో పద్మశాలీలు రాణించాలని పిలుపునిచ్చారు. కులం ఐక్యతతో ఉంటే సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని అని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కామార్తెపు మురళి మాట్లాడుతూ యువతరాన్ని ప్రోత్సహించి ప్రోత్సహించిన కుల బాంధవులకు ధన్యవాదాలు తెలిపారు .ఈ ఈ కార్యక్రమంలో పెండెం లక్ష్మీ రామానంద్, రాష్ట్ర తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు తెలంగాణ అఖిలభారత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు .వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆడెపు రవీందర్. వరంగల్ జిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం సమన్వయకర్త వర్ధనాల నరేందర్, అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం. తెలంగాణ రాష్ట్ర పురోహితుల సంఘం అధ్యక్షులు పాండురంగ శాస్త్రి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆడెపు రవీందర్,పద్మశాలి సంఘం, ఉపాధ్యక్షులు పెండెం రామానంద్ .పూర్వ అధ్యక్షులు రుద్ర ఓం ప్రకాష్. పూర్వ ప్రధాన కార్యదర్శి కూచిన శ్రీనివాస్. పూర్వ కోశాధికారి శ్రీరామ శంకరయ్య. సమన్వయకర్త నామాల సత్యనారాయణ. కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్, నామాల సత్యనారాయణ పట్టణ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు బాల్నే సర్వేశం, బాల్నే జగన్ తిమ్మా ఏకాంబరం, పెండెం వెంకటేశ్వర్లు, కూచన రాజు, చిలువేరు రజిని భారతి, వెల్దండి స్వరూప కోదాటి అనిత , పెండెం రాజేశ్వరి, గాజుల విమల గడ్డం రాజేందర్ కోదాటి వీరస్వామి కోదాటి గోపి. శ్రీరాముల కోటేశ్వర్ బంక పరమేశ్వర్ పెండెం శివానంద్. మండల శ్రీనివాస్, పర్శ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన



(డి4సి), భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఐటిఐ-ఎటిసి, వికాస్ ఒకేషనల్ కళాశాలల్లో సైబర్ జాగృత దివస్ సదస్సు నిర్వహించారు. ఎస్సై కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటిపి ఫ్రాడ్, పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్, పిఎం కిసాన్ ఏపికె ఫైల్, ఆర్టిఓ ఈ-చలానా ఫ్రాడ్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోతే 1930 కి కాల్ చేయాలని సూచించారు. వినాయక మండపాల వద్ద సైబర్ అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రవళి రెడ్డి, ప్రిన్సిపల్ జుమ్లా నాయక్, సైబర్ వారియర్ సముద్రాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని, దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా 2012 ఏప్రిల్ 13న ప్రారంభించామన్నారు. దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు 432వ సారి జనహిత సేవా సమితి వ్యవస్థాపక సభ్యుడు గాడేపు దామోదర్ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం జనహిత సేవా సమితి సభ్యుల సహకారంతో యాచకులకు, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా సుమారు 180 మందికి అన్నదానం చేశామన్నారు. ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి ఉపాధ్యక్షుడు కందుల రాజన్న, సహాయ కార్యదర్శులు గోడిశెల శేఖర్, ఆడే సురేందర్, కార్యవర్గ సభ్యులు డోలి సుకుమార్, రామిడి గంగయ్య, మహేష్, బిమిని కనకయ్య గౌడ్, నిచ్చకోల గురుస్వామి, శివ, బోనాల సతీష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్దకోడెపాకలో వైభవంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ



**శాయంపేట, సెప్టెంబర్ 2 (జనం సాక్షి )** శాయంపేట మండలంలోనిపెద్దకోడెపాక గ్రామంలోని కురుమ కులస్తులు శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పోచమ్మ తల్లి బోనాల పండుగను బుధవారం వైభవంగా నిర్వహించారు. డోలు వాయిద్యాల నడుమ భక్తులు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లగా, పోతరాజు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పోచమ్మ తల్లి అమ్మవారి చెంతకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.అమ్మవారికి మొక్కుబడిగా గొర్రె పొట్టేలు, కోళ్లు సమర్పించి, నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పోచమ్మ తల్లిని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీనా ప్రభాకర్ పెద్దమనిషి అమ్మరాజు, ఆలయ చైర్మన్ ముజిగిరి వేణు, సామాజిక సేవకుడు అమ్మ అశోక్, మహేందర్ గ్రామ పెద్దలు, కురుమ కులస్తులు భక్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రాజీనామా చేయాలి

### నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్

**బోథ్,సెప్టెంబర్ 02(జనంసాక్షి)** ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ విఫలమయ్యారని, వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ 1000 రోజుల పాలనలో ఒక్కరోజు కూడా ప్రజల్లోకి వచ్చి వారి సమస్యలను తెలుసుకోలేదని విమర్శించారు. కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండల కేంద్రంలో బోథ్, సోనాల మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆడే గజేందర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా పాలనలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. బోథ్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గత పదేళ్లలో జరగని పనులు ప్రస్తుత ప్రజా పాలనలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, సోనాల మండల అధ్యక్షుడు గాజుల పోతన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వినోద్ సింగ్, డీసీసీ కార్యదర్శి లోలపు పోశెట్టి, ఎల్మా వినయ్ రెడ్డి, మాజీ బ్లాక్ అధ్యక్షుడు నరసింహా దాస్, ఉపసర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు సుద్దుల అరుణ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చంటి, మాజీ బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయంలో మ్యాపింగ్

### ఆర్ఐ సప్న ఆధ్వర్యంలో విచారణ



**సిర్పూరు టి ఆగస్ట్ 02 (జనం సాక్షి)** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు వివిధ కారణాల వల్ల మ్యాపింగ్ చేయించుకోని 582 మంది ప్రజల కోసం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక విచారణ, హియరింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ఐ సప్న ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించారు.ఈ మ్యాపింగ్ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు వచ్చారు. బుధవారం మధ్యాహ్నం వరకు సుమారు 200 మంది దరఖాస్తుదారులు తమకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించి హియరింగ్లో పాల్గొన్నారు.కార్యక్రమాన్ని తహసీల్దార్ మహ్మద్ రహీముద్దీన్ స్వయంగా పర్యవేక్షించారు. లబ్ధిదారులు సమర్పించిన దరఖాస్తు ఫారాలను, పత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మ్యాపింగ్ విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా, పూర్తిగా పారదర్శకంగా విధులు నిర్వహించాలని హియరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

# మాదారంలో పోలీసుల కార్డన్ సెర్చ్

### యువతకు ఉచిత పోలీస్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సౌజన్య పిలుపు



**తాండూర్, సెప్టెంబర్ 02(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా: మాదారం 3 ఇన్క్లైన్ పరిధిలో బుధవారం రోజున పోలీసులు విస్తృతంగా కార్డన్ సెర్చ్ (తనిఖీలు) నిర్వహించారు. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) సౌజన్య ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా కాలనీల్లో శాంతిభద్రతలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సౌజన్య మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు యువతకు సరైన మార్గనిర్దేశం చేయడం పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులు కాకుండా విద్య, ఉపాధి, క్రీడ రంగాల్లో రాణించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఉచిత శిక్షణ, భోజన వసతి సౌకర్యం:మంచిర్యాలలో పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమయ్యే ఆసక్తి గల అభ్యర్థుల కోసం ఉచిత పోలీస్ శిక్షణ అందిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ శిక్షణతో పాటు అభ్యర్థులకు ఉచితంగా భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

## పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

- పోలీసులకు అప్పగింత
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**భీమిని సెప్టెంబర్ 2 జనం సాక్షి** భీమిలి మండలంలోని చిన్న గుడిపేట గ్రామంలో పిడిఎస్ రైస్ అక్రమ రవాణా జరుగుతున్న సమాచారాన్ని అందుకున్న టాస్కోర్స్ పోలీసు బృందం సోమ టెంకి శ్యాం ఇంట్లో శోదా నిర్వహించగా అందదా 10కింటల్లా పిడిఎస్ రైస్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని. బియ్యాన్ని ఎవరికీ అమ్ముతున్నావని ఆరా తీయగా దుర్గం రాజన్నకు అమ్ము తున్నానని చెప్పడం జరిగినదిని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి కోటేశ్వర్ తెలిపారు.

## గ్రోమోర్ సెంటర్‌ను ప్రారంభించిన మండల వ్యవసాధికారి కరుణాకర్



**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 02(జనం సాక్షి ) :**స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన గ్రోమోర్ సెంటర్‌ను మండల వ్యవసాయ అధికారి కరుణాకర్, మున్సిపల్ కౌన్సిలర్ చల్ల రమ్య రఘురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో కర్ణాకర్, కౌన్సిలర్ రమ్య రఘురెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రోమోర్ సెంటర్లో లభించే విత్తనాలు, ఎరువులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రోమోర్ మేనేజర్ కంతాల రాజిరెడ్డి, జోనల్ మేనేజర్ తిరుపతి రావు, ఏరియల్ మేనేజర్ శరత్ బాబు, బి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ డిఈ, ఈఆర్వో కార్యాలయం

# పూర్తి అయితే ప్రజలకు ఎంతో మేలు

### టీజీ ఎన్పిడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి



**స్టేషన్ ఘన్ పూర్,సెప్టెంబర్ 02(జనంసాక్షి ):** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ డిఈ, ఈఆర్వో కార్యాలయం పూర్తి అయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని టీజీ ఎన్పిడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ డిఈ, ఈఆర్వో కార్యాల యాన్ని టీజీ ఎన్పిడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేసి కార్యాలన్నీ వినియోగదారులకు అందు బాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సంపత్ రెడ్డి, డిఈ సారయ్య, ఏడిఈ రణధీర్ రెడ్డి, ఏఈలు పగిడి ముంతల శంకర్, సురేష్, శివకుమార్, కాంట్రాక్టర్,ఇంజనీర్ రాపోలు శివ చరణ్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, రఘురెడ్డి, లైన్మెన్లు, అసిస్టెం ట్ లైన్మెన్లు, జెఎల్ఎంలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ చేసిన సేవలు మరువలేనివి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెలిదె వెంకన్న




**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 02(జనం సాక్షి ) :** ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెలిదె వెంకన్న అన్నారు. స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో బుదవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివివాంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వవర్ధంతి మండలఅధ్యక్షుడు జులుకుంట్ల శిరీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సింగపురం వెంకటయ్యఆధ్వర్యం లో ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న మాట్లాడుతూ వైయస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ కొన సాగుతున్నాయని అన్నారు. ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమం లో కోఆప్షన్ సభ్యుడు గన్ను నరసింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నీల గట్టయ్య, బూర్ల శంకర్, కొలిపాక సతీష్, పోశాల కృష్ణ మూర్తి,జానీ బాబా, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, గుర్రం పాతి కుమార్, నోము ల జయపాల్ రెడ్డి,స్వామి నాయక్,రాజయ్య, పాపయ్య, ప్రజా ప్రతిని ధులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్ల ఆకస్మిక తనిఖీ

### అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి



**మల్హార్, సెప్టెంబర్ 02 (జనంసాక్షి)** అడిషనల్ కలెక్టర్ జయలక్ష్మి బుధవారం రోజు లోకల్ బాడీస్ నాచారం జీపీనీ ఆకస్మికంగా తనిఖీ చేసి ఇందిరమ్మ ఇండ్లనీ తనిఖీ చేయడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తొందరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని చూచిండం జరిగింది. అలాగే అన్సాన్ పల్లి జీపీ పరిధిలో జరుగుచున్న ఫారం ఫాండ్ నీ సందర్శించి కూలీలకు పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ క్రాంతి కుమార్, ఎంపీవో మల్లికార్జున్,ఎపిఓ గిరి హరీష్,సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

### కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పులిగిల్ల సర్పంచ్



**నడి కూడ సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** నడికూడ మండలం పులిగిల్ల గ్రామ సర్పంచ్ ఇనుగాల పద్మ ఐలయ్య బీఆర్ఎస్ పార్టీని వీడి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. వీరితోపాటు బిఆర్ఎస్ నుండి వార్డు మెంబర్ ఇనుగాల సువార్త-శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు శ్రీ గజ్జి కైలాసం, కాంతమ్మ, పాలకుర్తి సురేష్, ఇనుగాల సుదర్శన్, బొల్లె రవీందర్, ఇనుగాల కుమార్ దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పర్నేం మల్లా రెడ్డి , జిల్లా కార్యదర్శి బచ్చుటి మోహన్ రావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

### హాజరైన మాజీ ఎమ్మెల్యే రాజయ్య,నాగుర్ల వెంకటేశ్వర్లు



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 02(జనం సాక్షి) :** కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనకు వ్యతిరేకంగా స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రం లోని బస్టాండ్ ముందుగల అంబేద్కర్ విగ్రహం ముందు నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ భారీధర్నాకు పార్టీ శ్రేణులు,నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ నిరసన గళాన్ని బలంగా వినిపించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటి కొండ రాజయ్య, తెలంగాణ రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల వైఫల్యాలపై,420 హామీల అమలులో వైఫల్యాలపై, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్య పాలనపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి



**టేకుమట్ల సెప్టెంబర్ 02 జనంసాక్షి** భూపాల్ పల్లి జిల్లా టేకుమట్ల మండలంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఓ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు దాసరపు వర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నది. ఈ ఫీజులు చెల్లించలేని దుస్థితి కారణంగా ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలల్లో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయి.కొందరు విద్యార్థులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. మొత్తంగా ఈ ప్రభావం ఒక కోటి కుటుంబాలపై పడింది. ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఈ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థులు ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. అదేవిధంగా అర్జెంటుగా ప్రభుత్వం కళాశాలలో చెల్లించే ఫీజులతో నిమిత్తం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీ యాజమాన్యం ఆపకుండా వెంటనే ఇచ్చేలా ఒక జీవో ని విడుదల చేయాలి కోరాడు. ఈ కార్యక్రమంలో ఎంజెఫ్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ పర్లపల్లి వంశీ బీసీ ఎస్సీ ఎస్టీ - జేఏసీ ఓ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పవన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పార్టీ ఆఫీసుగా మార్చిన సర్పంచ్ భర్త



**శాయంపేట, సెప్టెంబర్ 2 (జనం సాక్షి)** శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సెప్టెంబర్ 1 మంగళవారం రోజున గ్రామ సర్పంచ్ మడికొండ ఇందిర , ఉప సర్పంచ్ లేకుండా సర్పంచ్ భర్త కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మీటింగ్ పెట్టడమే కాకుండా ప్రెస్ మీట్ కూడా నిర్వహించడం జరిగిందని వార్డు సభ్యులు పోరండ్ల చరణ్ ఆరోపిస్తున్నారు. ప్రెస్ మీట్ పెట్టడానికి అది గ్రామ పంచాయతీ కార్యాలయమా లేకపోతే కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా అని వార్డు సభ్యులు పోరండ్ల చరణ్, ఏ కెళ్ళి సందీప్ ప్రశ్నించడం జరిగింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో రాజకీయ సమావేశం నిర్వహించడం ఎంతవరకు సబబు అని అన్నారు. ఆ కార్యక్రమం నిర్వహించడానికి అతనికి అధికారం ఎవరిచ్చారు అని వారు మండిపడ్డారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు గాని ప్రజా పరిపాలనకు సంబంధించిన సమావేశాలు కానీ అధికారిక కార్యక్రమాలు గాని నిర్వహించాలి కానీ పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని దీనికి అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఇట్టి సంఘటనపై అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి బాధ్యుల పైన చర్యలు తీసుకోవాలని పత్రికాముఖంగా వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా డిపిఓకి మరియు జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవ ఏర్పాట్లకు సిద్ధం చేయండి



**మహదేవపూర్:సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** తాశీల్దార్ ఫైర్ స్టేషన్ ప్రభుత్వ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రోజు మహదేవపూర్ మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్. తాశీల్దార్ కార్యాలయం భవనాని జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయలకు సంబంధించిన మౌలిక వసతులు తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫైర్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి ఫైర్ ఇంజన్లు ఎమర్జెన్సీ విపత్తు సమయములో వాహనాలు సులభంగా రాకపోకలు సాగే అలా పార్కింగ్ ప్రాంగణము ఇబ్బంది కాకుండా అనువుగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నూతన తాసిల్దార్ కార్యాలయానికి సంబంధించి కావలసిన పనులను తక్షణమే పూర్తిచేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విద్యాసాగర్ , ఎంపీడీవో రవీంద్రనాథ్. ఎంపీ ఓ ప్రకాష్ రెడ్డి. అగ్నిమాపక అధికారి నాగరాజు. రవి డిప్యూటీ తాసిల్దార్ యూసుఫ్ బీ పాల్గొన్నారు.

# సమగ్ర ఓటరు సవరణ హియరింగ్ ప్రక్రియ పరిశీలన

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో నగరంలోని కాశీబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం, వరంగల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు హియరింగ్ ప్రక్రియను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పరిశీలించారు. బుధవారం వరంగల్ ఆర్డీవోతో కలిసి ఆయా కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, సమగ్ర ఓటరు సవరణకి సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలపై నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి అంశాన్ని నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ సీతారాం

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 02(జనంసాక్షి).** ములుగు కేంద్రీయ విద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరానికి బాలవాటిక--1, బాలవాటిక--2, బాలవాటిక--3తో పాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాల కోసం సెప్టెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ప్రారంభించిన కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల నమోదు కొనసాగుతోందని పేర్కొన్నారు. అర్హత కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాల కోసం సెప్టెంబర్ 10న లాటరీ నిర్వహించి, 12న ప్రవేశ జాబితాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 21 వరకు సీట్ల కేటాయింపు, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసి, 23వ తేదీ నుంచి తరగతులను ప్రారంభించనున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయ సంగఠన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, వయస్సు, ప్రాధాన్యతా క్రమం, రిజర్వేషన్లు తదితర నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా తమ పిల్లల ప్రవేశాల కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జవహర్‌నగర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ములుగు కేంద్రీయ విద్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# యాది సభకు బయలుదేరిన ఉద్యమకారుడు



**నర్సంపేట సెప్టెంబర్ 2 ( జనం సాక్షి)** హనుమకొండ లోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా అఖిలపక్ష తెలంగాణ ఉద్యమకారులు నిర్వహిస్తున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత . పెద్ది సుదర్శన్ రెడ్డి . యాది సభ కార్యక్రమానికి నర్సంపేట నుండి బయలుదేరిన సహచర ఉద్యమకారులు అభిమానులు దార్ల రమాదేవి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, రావుల సతీష్, రామసాయం ఉపేందర్ రెడ్డి, గుంటి కిషన్, బూస అశోక్, బాలు నాయక్, షేక్ ఇర్ఫాన్,పల్నాటి సాంబయ్య, మద్దెల సాంబయ్య, గాదె ఇసాక్. తదితరులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేట కాంగ్రెస్ టౌన్ యువజన అధ్యక్షుడు అఖిల్ మాలకు సన్మానం



**బచ్చన్నపేట సెప్టెంబర్ 2 ( జనం సాక్షి):** బచ్చన్నపేట కాంగ్రెస్ టౌన్ యువజన అధ్యక్షుడిగా అఖిల్ మాల ఎన్నికైన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ మసూద్, సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షిస్తూ పార్టీ బలోపేతానికి అఖిల్ మాల కృషి చేయాలని ఆకాంక్షించారు. యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని సూచించారు. ఆయన నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని అభినందించారు.

# ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

## మండల అధ్యక్షులు దారావత్ బాలాజీ నాయక్



**గూడూరు,సెప్టెంబర్02(జనంసాక్షి):** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత కీ.శే.వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధారావత్ బాలాజీ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల కోసం, రైతులు, మహిళలు,విద్యార్థుల సంక్షేమానికి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, రైతులకు ఉచిత విద్యుత్,ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా సామాన్య ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్, మాజీ మండల అధ్యక్షులు చిట్టే వెంకన్న,బీరం శ్రీపాల్ రెడ్డి అగ్రం వీరాస్వామి,ఎండీ రసూల్,రాసమల్ల యాకయ్య,సర్పంచ్ లు బానోత్ పూర్ణ చందర్,రాజు నాయక్,పూజారి శంకర్,షాజహాన్, తాటి బుచ్చయ్య,శ్రీనివాస్,వార్డ్ సభ్యులు,నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.